ANN తెలుగు

Follow: @ANNTELUGU

18-07-2025

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 225 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## స్క్విడ్ గేమ్‌లో జై బాలయ్య

### దుమ్మురేపుతున్న ఏఐ వైరల్ వీడియో

మహా: స్క్విడ్ గేమ్ గురించి ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ సిరీస్ భారతీయులను ఓ రేంజ్ లో మెప్పించింది. తాజాగా అఖండ 2 టీజర్ స్వూఫ్ తో స్క్విడ్ గేమ్ ను డిజైన్ చేశారు. స్క్విడ్ గేమ్ లో నందమూరి బాలకృష్ణ పాల్గొంటే ఇక దబిడిదిబిడే అన్న థీమ్ తో దీనిని డిజై చేయగా, అదిరిపోయే రేంజ్ లో వైరల్ అవుతోంది. అనసూయ, రాజీవ్ కనకాలతో పాటు హీరోగా నందమూరి బాలకృష్ణ స్క్విడ్ గేమ్ ఆడడానికి వెళ్లారు. ది మ్యాన్ విత్ అంబ్రెల్లా అనే ఎపిసోడ్ లో ఒక గేమ్ ఉంటుంది. బెల్లంతో తయారుచేసిన ఒక స్వీట్ లోపల సర్కిల్, స్టార్, అంబ్రెల్లా షేప్స్ ఉంటాయి. వాటిని కరెక్ట్ గా కట్ చేసి చూపించాలి. కొంచెం పక్కకు జరిగినా మరణం తథ్యం. ఇక ఈ వీడియోలో కూడా బాలయ్య, రాజీవ్ కనకాల, అనసూయ ఆ షేప్స్ ను కట్ చేయడం చూపించారు. అనసూయ కరెక్ట్ గా కట్ చేయడంతో ఆమె సేవ్ అవుతుంది. రాజీవ్ కనకాల ఓడిపోవడంతో అతడిని చంపేస్తారు. హీరో అయిన బాలయ్య ఓపిక లేక ఆ స్వీట్ ను మొత్తం తినేస్తాడు. దీంతో అతనిని చంపడానికి గేమ్ నిర్వాహకులు వస్తుంటే.. అఖండ 2 టీజర్ లో త్రిశూలం తిప్పుతూ వారందరినీ మట్టి కరిపించినట్టే.. ఇక్కడ ఒక రాడ్ ను తిప్పుతూ వారందరినీ చంపేశాడు. వారి గన్ తోనే అందరినీ పైకి లేపి కిందపడేశాడు. ఇదీ బాలయ్య స్క్విడ్ గేమ్. జై బాలయ్య అని చివర్లో చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో దుమ్మురేపోతంది.

**టాప్ న్యూస్**

## బండి సంజయ్‌కి సిట్ పిలుపు

- 24న ఫోన్ ట్యాపింగ్ పై వాంగ్మూలం
- కేసీఆర్ పాపమే ఈ లవ్ లెటర్



02

## కేసీఆర్ కుటుంబంపై కోర్టులకు వెళతాం

- బీఆర్ఎస్ పోవడం వల్లే ఫోన్ ట్యాపింగ్ బయటపడింది
- సిట్ విచారణలో వాంగ్మూలం అనంతరం తీన్మార్ మల్లన్న
- తన వద్ద ఉన్న ఆధారాలను సిట్ అధికారులకు అందించానని వెల్లడి



02

## ఏ చొక్కా వేసుకున్నా ఇందిరమ్మ ఇళ్ళు పక్కా

- 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



02



# కేటీఆర్ డ్రగ్స్ బ్యాచ్

## కేటీఆర్ మిత్రుడు దుబాయ్‌లో చనిపోయాడు

దానికి సంబంధించిన ఫోరెన్సిక్ రిపోర్టును తెలంగాణకు తెప్పించాం

**కేటీఆర్ చుట్టూ ఉండేవాళ్ళు డ్రగ్స్ తీసుకుంటారు**

కేదార్ మరణ కారణాల రిపోర్టు అసెంబ్లీలో పెట్టడానికీ సిద్ధమే

ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

ఏపీ మంత్రి లోకేశ్‌ను కేటీఆర్ చీకట్లో ఎందుకు కలిశారు?

కేటీఆర్ నాయకత్వాన్ని కవిత ఒప్పుకోవట్లే

కవితను కేసీఆర్ కుటుంబమే పట్టించుకోవడం లేదు

కేసీఆర్ కుటుంబం కడుపునిండా విషం పెట్టుకుని మాట్లాడుతోంది

### సంచలన ఆరోపణలు

*కేదార్‌తో కలిసి కేటీఆర్ దుబాయిలో డ్రగ్స్ తీసుకున్నారని, డ్రగ్స్ కలగలిపి తీసుకోవడం వల్లే కేదార్ మరణించాడని, కేదార్ మరణంపై పూర్తి నివేదిక ఉందని అన్నారు. మద్యంలో కాక్‌టెయిల్ విన్నామని, డ్రగ్స్‌లో కాక్‌టెయిల్ వినలేదని, డ్రగ్స్ విషయంలో తొలిసారి కాక్‌టెయిల్ అని వింటున్నామని తెలిపారు. అవసరమైనప్పుడు కేదార్ మరణ కారణాల రిపోర్టు బయటపెడతామని అన్నారు. కేదార్ మరణ కారణాల రిపోర్టు అసెంబ్లీలో పెట్టడానికీ సిద్ధమేనని, తాను చర్చిస్తానంటోంది ప్రతిపక్షనేత కేసీఆర్‌తో మాత్రమేనని, కేటీఆర్‌తో కాదని వెల్లడించారు.*

దుబాయ్‌లో మాజీ మంత్రి కేటీఆర్ స్నేహితుడు కేదార్ డ్రగ్స్ తీసుకుని చనిపోయాడని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో గురువారం మీడియాతో చిట్ చాట్ నిర్వహించినాయన కేటీఆర్ , బీఆర్ఎస్ పార్టీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కేదార్ కు సంబంధించిన ఫోరెన్సిక్ రిపోర్టును తెలంగాణకు తెప్పించినట్లు తెలిపారు. కేటీఆర్ గంజాయి బ్యాచ్ అని.. అతని చుట్టూ ఉండేవాళ్లు డ్రగ్స్ తీసుకుంటారని ఆరోపించారు. డ్రగ్స్ తీసుకునే కేటీఆర్ తో తానేం మాట్లాడతానని ఎద్దేవా చేశారు. వైట్ ఛాలెంజ్ విసిరితే పారిపోయిన వ్యక్తి కేటీఆర్ అంటూ చురకలు అంటించారు. డ్రగ్స్ పై మాట్లాడకుండా కోర్టులకు వెళ్లి స్టే తెచ్చుకుంది కేటీఆర్ కాదా? అని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం కడుపునిండా విషం పెట్టుకుని మాట్లాడుతోందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి రాష్ట్రప్రభుత్వానికి తగిన సూచనలు ఇవ్వాలని, ఆయన ఇచ్చిన స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. - మహా, ఢిల్లీ

02

## నాపై ఏదైనా డ్రగ్స్ కేసు నమోదైందా?

### దమ్ముంటే ఆధారాలు బయటపెట్టు

- సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి కేటీఆర్ సవాల్
- మిమ్మల్ని కోర్టుకు లాగుతా
- నిరాధార ఆరోపణలకు క్షమాపణలు చెప్పాలి



హైదరాబాద్, మహా: సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో చేసిన కామెంట్లపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి మీడియా చిట్‌చాట్ పేరుతో నాపైన, ఇతరులపైన విషయం చిమ్మడం ఇదే మొదటిసారి కాదు. కేవలం ముఖ్యమంత్రి కార్యాలయానికి గౌరవం ఇచ్చి ఇప్పటివరకు సంయమనం పాటించాను అని కేటీఆర్ తెలిపారు. మిగతా 2లో

## బీఆర్ఎస్ నా దారికి రావాల్సిందే

### కాంగ్రెస్ కరెక్ట్.. బీఆర్ఎస్ నాయకులు ఆర్డినెన్స్ వద్దనడం సరికాదు

చిట్ చాట్‌లో ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు

రిజర్వేషన్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ కరెక్టే


తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై స్పందించకపోవడం విజ్ఞతకే వదిలేస్తున్నా




హైదరాబాద్, మహా: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్‌పై ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ సరైనదే అని చెప్పుకొచ్చారు. గురువారం మీడియా చిట్ చాట్‌లో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్‌పై ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ కరెక్టే అని, బీఆర్ఎస్ నాయకులు ఆర్డినెన్స్ వద్దని చెప్పడం సరికాదన్నారు. 'బీఆర్ఎస్ వాళ్ళు నా దారికి రావాల్సిందే. నాలుగు రోజులు టైం తీసుకుంటారేమో అంతే. 2018 చట్ట సవరణ చేసి ఆర్డినెన్స్ తేవడం సబబే. మిగతా 2లో

## చిల్లర మాటలు బంద్ చెయ్

- దుబాయ్ లో ఎవరో చనిపోతే మాకేం సంబంధం?
- కేటీఆర్‌పై సీఎం చేసిన చెత్త వ్యాఖ్యలు ఖండిస్తున్నా
- మాజీ మంత్రి హరీశ్ రావు మండిపాటు



హైదరాబాద్, మహా: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో చిట్ చాట్ చేశారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి పక్కన ఉన్న వారంతా గార్బేజ్ బ్యాచ్. అసలే ఢిల్లీలో కాలుష్యం ఎక్కువ. ఢిల్లీలో రేవంత్ రెడ్డి చెత్త వ్యాఖ్యలతో మరింత కాలుష్యం పెరిగింది. బనకచర్లపైన రేవంత్ రెడ్డి నగ్నంగా దొరికిపోయాడు. రేవంత్ రెడ్డి చీకటి బాగోతం కప్పిపుచ్చుకునేందుకు బజారులోని చెత్త అంతా మీడియా ముందు ఉంచాడు. మిగతా 3లో



## వంశీచంద్ రెడ్డికి కీలక బాధ్యతలు

దేశ వ్యాప్తంగా డీసీసీల నియామక ప్రక్రియ బాధ్యతలు

ఖర్గే ఆదేశాలతో ఉత్తర్వులు

వివరాలు 3లో

## పరుష పదజాలానికి బ్రాండ్ అంబాసిడర్లు మీరే

బీఆర్ఎస్‌పై ఎంపీ రఘువీర్ రెడ్డి ఫైర్

వివరాలు 2లో

## హెచ్‌సీఏ గ్రౌండ్‌లోకి ఈడీ

### పీఎంఎల్‌ఏ సెక్షన్ల కింద కేసు నమోదు

అక్రమార్కుల వెనుక కేటీఆర్, కవిత ఉన్నారు

సీఐడీ, ఈడీకి టీసీఏ ఫిర్యాదు.. దర్యాప్తు జరపాలని విన్నపం

అవినీతి బాగోతంపై సీఐడీ ఫోకస్.. కీలక విషయాలు వెలుగులోకి వచ్చే చాన్స్





హైదరాబాద్, మహా: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కేసులో ఈడీ అడుగుపెట్టింది. హెచ్‌సీఏ పై పీఎంఎల్‌ఏ సెక్షన్ల కింద ఈడీ కేసులు నమోదు చేసింది. బీసీసీఐ నుంచి వచ్చిన నిధుల విషయంలో మనీలాండరింగ్ జరిగినట్లు అనుమానంతో ఈడీ కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో సంచలనంగా మారుతున్న హెచ్‌సీఏ కుంభకోణం కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో నమోదైన రెండు హెచ్‌సీఏ కేసులను కలిపి కొత్త ఈసీఐఆర్‌ను తయారు చేసింది. మిగతా 2లో

## సెమీ కండక్టర్, హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటుకు అనుమతినివ్వండి


### కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

ఢిల్లీ, మహా: తెలంగాణలో సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు త్వరగా అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి .. కేంద్ర ఐటీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. రాష్ట్రంలో అధునాతన సౌకర్యాలు, పరిశోధన కేంద్రాలు ఉన్నందున ఎఎస్ ఐపీ, మైక్రో ఎల్ ఈడీ ప్రాజెక్టులకు ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా ముచ్చెర్లలో హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటుకు ఈఎంసీ 2.0 పథకం కింద అనుమతి ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ ఇప్పటికే పరిశోధనా సౌకర్యాలతో, సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులతో ముందంజలో ఉన్నదని సీఎం వివరించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ఉద్యోగాలు, పెట్టుబడులు పెరగడంతోపాటు, దేశీయ టెక్నాలజీ రంగానికి తెలంగాణ కీలక కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మిగతా 2లో



# కేటీఆర్ డ్రగ్స్ బ్యాచ్

**ఢిల్లీ, మహా :** దుబాయ్‌లో మాజీ మంత్రి కేటీఆర్ స్నేహితుడు కేదార్ డ్రగ్స్ తీసుకుని చనిపోయాడని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో గురువారం మీడియాతో చిట్ చాట్ నిర్వహించినాయన కేటీఆర్ , బీఆర్ఎస్ పార్టీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కేదార్ కు సంబంధించిన ఫోరెన్సిక్ రిపోర్టును తెలంగాణకు తెప్పించినట్లు తెలిపారు. కేటీఆర్ గంజాయి బ్యాచ్ అని.. అతని చుట్టూ ఉండేవాళ్లు డ్రగ్స్ తీసుకుంటారని ఆరోపించారు. డ్రగ్స్ తీసుకునే కేటీఆర్ తో తానేం మాట్లాడతానని ఎద్దేవా చేశారు. వైట్ ఛాలెంజ్ విసిరితే పారిపోయిన వ్యక్తి కేటీఆర్ అంటూ చురకలు అంటించారు. డ్రగ్స్ పై మాట్లాడకుండా కోర్టులకు వెళ్లి స్టే తెచ్చుకుంది కే టీ ఆ ర్



కాదా? అని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం కడుపునిండా విషం పెట్టుకుని మాట్లాడుతోందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి రాష్ట్రప్రభుత్వానికి తగిన సూచనలు ఇవ్వాలని, ఆయన ఇచ్చిన స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

**మహారాష్ట్రలో పర్యటిస్తా**

తుమ్మిడిహట్టి ప్రాజెక్టు కోసం మహారాష్ట్రలో పర్యటిస్తానని రేవంత్ రెడ్డి తెలిపారు. రెండున్నర సంవత్సరాల్లో లక్ష ఉద్యోగాలు ఇచ్చి తీరుతామని అన్నారు. బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్ తప్ప పాత పథకాలన్నీ అమల్లోనే ఉన్నాయని గుర్తు చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖలు రాయడం కాదని, ప్రణాళికతో ముందుకు రావాలని సూచనలు చేశారు. కిషన్ రెడ్డితో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నిన్నటి ముఖ్యమంత్రుల భేటీలో మూడు అంశాలు పరిష్కారానికి వచ్చాయని రేవంత్ రెడ్డి తెలిపారు. బనకచర్ల సహా అన్ని అంశాలపై అధ్యయన కమిటీని వేశామని, కమిటీ పరిష్కరించలేని అంశాలపై సీఎంలం మళ్లీ చర్చిస్తామని చెప్పారు. నదుల అనుసంధానం కోసం కేంద్రం ప్రయత్నిస్తోందని, ఇచ్చంపల్లి నుంచి కావేరికి అనుసంధించాలనే ప్రతిపాదన ఉందని పేర్కొన్నారు.

**కేటీఆర్ నాయకత్వాన్ని కవిత ఒప్పుకోవట్లేదు**

ప్రతిపక్షనేత పదవి ఇవ్వాలని కేసీఆర్‌ను ఆయన కుమారుడు, మాజీ మంత్రి కేటీఆర్ అడుగుతున్నారని, కేటీఆర్ కోరికను కేసీఆర్ ఒప్పుకోవడం లేదని సీఎం అన్నారు. సొంత వివాదాలతోనే కేసీఆర్ కుటుంబానికి సరిపోతోందని, కేటీఆర్ నాయకత్వాన్ని కవిత ఒప్పుకోవట్లేదని తెలిపారు. కేంద్రం పిలిచినప్పుడు వెళ్లకుండా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్లాలా?, ఫామ్‌హౌసులకు వెళ్తే సమస్యలెలా పరిష్కారమవుతాయని సీఎం ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో ఏపీ మంత్రి లోకేశ్‌ను కేటీఆర్ చీకట్లో ఎందుకు కలిశారని ప్రశ్నించారు.

**ఈడి కేసుల్లో జాప్యంపై కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలి**

హైకోర్టు పర్యవేక్షణలో ఫోన్ ట్యాపింగ్ విచారణ జరుగుతోందని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు సీబీఐకి ఇవ్వాలని కొందరు అడుగుతున్నారని అన్నారు. ప్రభాకర్‌రావుని రప్పించడంలో కేంద్రం ఏడాదిన్నర ఆలస్యం చేసిందని, రాష్ట్ర దర్యాప్తులో ఏం తప్పులున్నాయో ఎత్తి చూపించండని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో దర్యాప్తు జరుగుతున్న పలు కేసులు ఈడీ తీసుకుందని, ఈ కేసుల విచారణలో పురోగతి ఎందుకు లేదన్నారు. దీనిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రతిపక్షనేతగా కేసీఆర్ ఢిల్లీకి వెళ్లవచ్చనని, రాష్ట్రం కోసం కేసీఆర్ పని చేస్తానంటే ఎవరూ అడ్డుకోరని అన్నారు. గతంలో డ్రగ్స్ కేసులో హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుంది తాను కాదని, ఛాలెంజ్ చేయడం కోర్టుకెళ్లి స్టే తెచ్చుకోవడం కేటీఆర్‌కు అలవాటే అని ఎద్దేవా చేశారు. శాఖాపరమైన విచారణలు రాత్రికి రాత్రి పూర్తి కావన్నారు.

## ముందు అక్కడ రద్దు చేయండి

బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుపై తమకో వ్యూహం ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. 2018లో కేసీఆర్ పంచాయితీ రాజ్ చట్టంలో మార్పులు చేశారని, 50శాతం రిజర్వేషన్లు వద్దని చట్టంలో మార్పులు చేశారని, 2014 ముందు 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 23 శాతానికి కుదించారని తెలిపారు. రిజర్వేషన్ల కుదింపును సవరిస్తూ ఆర్డినెన్స్ తీసుకొచ్చామని అన్నారు. ఆర్డినెన్సుపై అవగాహన లేకుండా చాలామంది మాట్లాడుతున్నారని ఆరోపించారు. ముస్లిం రిజర్వేషన్లు స్వాతంత్రం వచ్చినప్పటి నుంచే ఉన్నాయని, ముస్లింలకు బీసీ-ఇ గ్రూపులో రిజర్వేషన్లు ఉన్నాయని, బీజేపీ రాష్ట్రాల్లోనూ ముస్లింలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయని చెప్పారు. గుజరాత్, యూపీ, మహారాష్ట్రలో ముస్లిం రిజర్వేషన్లు ఉన్నాయని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లు ఎత్తేసిన తర్వాతే కిషన్‌రెడ్డి మాట్లాడాలని రేవంత్ రెడ్డి సూచించారు.

# నాపై ఏదైనా డ్రగ్స్ కేసు నమోదైందా?

(మొదటిపేజీ తరువాయి)

డ్రగ్స్ కేసులో నాపై విచారణ జరుగుతుందని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకి ఆధారం ఏమిటో చెప్పాలి. నాపైన ఏమైనా కేసు నమోదైందా? కనీసం అణువంత రుజువైనా ఉన్నదా? ముఖ్యమంత్రికి దమ్ముంటే దొంగ చాటుగా చేసిన వ్యాఖ్యలపై ఆధారాలు బయటపెట్టాలని సవాల్ విసురుతున్నాను. లేకుంటే తాను చేసింది చౌకబారు, చిల్లర వ్యాఖ్యలు అని ఒప్పుకోవాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో నాతో ముఖాముఖి చర్చకు వచ్చే దమ్ములేక ఢిల్లీ వరకు ప్రయాణం చేసి మరీ రేవంత్ రెడ్డి నాపై బురద జల్లుతున్నాడు. కేవలం చట్టం పరిధి నుంచి న్యాయస్థానాల పరిధి నుంచి తప్పించుకోవడానికే ముఖ్యమంత్రి చిట్‌చాట్‌ల పేరుతో దొంగచాటు మాటలు మాట్లాడుతున్నాడు. పిరికి దద్దమ్మలా చిట్‌చాట్‌ల పేరుతో నా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నాడు. వీటన్నింటినీ ఇకపై సహించేది లేదు.. రేవంత్ రెడ్డి చేసిన అసత్యపూరిత, దురుద్దేశపూర్వక నిందలకు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. రేవంత్ తాను చేసిన నిరాధార ఆరోపణలకు వెంటనే క్షమాపణ చెప్పాలి. లేదంటే పర్యవసానాలు ఎదుర్కోవాల్సి వస్తుంది అని కేటీఆర్ హెచ్చరించారు.



# బీఆర్ఎస్ నా దారికి రావాల్సిందే

## కాంగ్రెస్ కరెక్ట్.. బీఆర్ఎస్ నాయకులు ఆర్డినెన్స్ వద్దనడం సరికాదు

### చిట్ చాట్‌లో ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు
### రిజర్వేషన్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ కరెక్టే
### తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై స్పందించకపోవడం విజ్ఞతకే వదిలేస్తున్నా

(మొదటిపేజీ తరువాయి)

నేను న్యాయనిపుణులతో చర్చించిన తర్వాతే ఆర్డినెన్స్‌కు సపోర్ట్ చేశాను. అలాగే, తీన్మార్ మల్లన్న నాపై చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ నాయకులు స్పందించకపోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నాను. ఒక ఎమ్మెల్సీ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లనను నేను జనాభా లెక్కల నుంచి తీసివేశాను అన్నారు. ఆయన ఎవరో నాకు తెలియదు. బనకచర్లపై చర్చకు తాను వెళ్లనని సీఎం రేవంత్ రెడ్డి మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. నిన్నటి డిల్లీ సమావేశంలో ఎజెండాలో మొదటి అంశమే బనకచర్ల. ముఖ్యమంత్రి, మంత్రి ఉత్తమ్ సిగ్గులేకుండా గోదావరి జలాలను చంద్రబాబు చేతిలో పెట్టారు. బనకచర్లపై చర్చే జరగలేదని రేవంత్ రెడ్డి బుకాయిస్తున్నాడు. తెలంగాణ హక్కులను కాలరాసిన నాన్ సీరియస్ ముఖ్యమంత్రి తన పదవి రాజీనామా చేయాలి. బనకచర్ల వల్ల ఆంధ్రా ప్రజలకు ఏం లాభం లేదు. కాంట్రాక్టర్లు, కమిషన్ల కోసం బనకచర్ల కడుతున్నారు. ముఖ్యమంత్రి మెగా కంపెనీ వాటా కోసమే డిల్లీకి వెళ్లారు. చంద్రబాబు ఎజెండాలో భాగంగానే సీఎం డిల్లీకి వెళ్ళాడు. బనకచర్ల ఆపకపోతే న్యాయపోరాటం చేస్తాం' అని కవిత వ్యాఖ్యానించారు.

**సీఎం పదవికి రేవంత్ రాజీనామా చేయాలి..**

సీఎం రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చంద్రబాబును ఎదుర్కొని సన్మానం చేశారు. సిగ్గులేకుండా బనకచర్ల ప్రాజెక్టును చంద్రబాబుకు అప్పనంగా అప్పగించారు. రేవంత్ రెడ్డి బనకచర్లపై బుకాయిస్తున్నారు. ఆయనకు పాలించే హక్కు లేదు. తక్షణమే సీఎం పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి. నాలుగు విజయాలు సాధించామని సీఎం రేవంత్ రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారు. కృష్ణానది బోర్డును అమరావతిలో పెట్టడం అనేది ఏపీ విభజన చట్టంలో ఉంది. తెలంగాణ ప్రజల హక్కులను చంద్రబాబు కాళ్ల దగ్గర తాకట్టుపెట్టారు. పార్లమెంట్ సమావేశాలు జరగబోతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలి. తన స్కూల్ బీజేపీ, కాలేజీ టీడీపీ, ఉద్యోగం కాంగ్రెస్‌లో అని సీఎం చెప్తుంటారు. ముఖ్యమంత్రి ఇంకా కాలేజీలోనే ఉన్నానని అనుకుంటున్నారు. అందుకే గోదావరి నీళ్లను చంద్రబాబుకు గిఫ్టుగా ఇచ్చారు. తుపాకులగూడెం నుంచి నదుల అనుసంధానం జరిగితే తెలంగాణ, ఆంధ్రాకు న్యాయం జరుగుతుంది. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు బనకచర్లపై అసలు చర్చ జరగలేదు. కొప్పుల ఈశ్వర్ స్వయంగా బొగ్గుగని కార్మికుడు.. వారికి బొగ్గుగని కార్మిక సంఘం బాధ్యతలు అప్పగించడాన్ని స్వాగతిస్తున్నా' కవిత ప్రకటించారు.



# హెచ్‌సీఏ గ్రౌండ్‌లోకి ఈడి

(మొదటిపేజీ తరువాయి)

బీసీసీఐ నుంచి వచ్చిన నిధుల విషయంలో మనీలాండరింగ్ జరిగినట్లు అనుమానంతో ఈడీ కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. సీఐడీ కస్టడీ ముగిసిన వెంటనే ఈడీ విచారణ ప్రారంభించే అవకాశం ఉంది. ఈసీఐఆర్ లో ఐదుగురిపై కేసులు నమోదు చేసింది. వారిలో జగన్మోహన్ రావు, శ్రీనివాసరావు, రాజేంద్ర యాదవ్, సునీల్ కాంటే, జీ. కవితలు ఉన్నారు.

**సీఐడి కస్టడీలో..**

ఈ కేసులో ఐదుగురిని అరెస్ట్ చేయగా తాజాగా సీఐడీ వారిని కస్టడీలోకి తీసుకుంది. అయితే మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితతో పాటు మరికొంత మందిపై సీఐడీకి తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) ఫిర్యాదు చేసింది. ఈ మేరకు గురువారం సీఐడీ చీఫ్ చారు సిన్హాను టీసీఏ అధికారులు కలిసి హెచ్‌సీఏ అక్రమాలపై ఫిర్యాదు చేశారు. హెచ్‌సీఏలో అక్రమార్కుల వెనుక కేటీఆర్, కవిత హస్తం ఉందని వారు ఆరోపించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా జగన్‌మోహన్ రావు గెలిచిన వెంటనే 'నా విజయం కేటీఆర్, కవిత, హరీష్ రావుకు అంకితం చేసినట్లు' చెప్పారని టీసీఏ ఫిర్యాదులో తెలిపింది. ప్రస్తుతం అరెస్ట్ ఐన నిందితుల వెంట ఉండి చక్రం తిప్పిన అసలు దొంగలు తప్పించుకు తిరుగుతున్నారని.. వారిపై కూడా దర్యాప్తు చేయాలని కోరారు. వంకా ప్రతాప్, జాన్ మనోజ్, అర్షద్ ఆయూబ్, సురేందర్ అగర్వాల్, పురుషోత్తం అగర్వాల్ లపై కూడా ఫిర్యాదు చేశారు. హెచ్ సీఏలో కోట్ల రూపాయల దుర్వినియోగం తోపాటు.. మనీ ల్యాండరింగ్ జరిగిందని ఈడీ కి కూడా టీసీఏ సెక్రటరీ గురువా రెడ్డి, ప్రెసిడెంట్ యెండల లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే ఈడీ కూడా ఎంటరైంది.

**ఆ ఇద్దరి హస్తం**

దీనిపై ఫిర్యాదు చేస్తూ కవిత, కేటీఆర్‌తో పాటు హెచ్‌సీఏలోని కొందరు అక్రమార్కులపై దర్యాప్తు చేయాలని టీసీఏ అధికారులు కోరారు. గత 10 ఏళ్లలో బీసీసీఐ నుంచి దాదాపు రూ.500600 కోట్ల నిధులు వచ్చినా, క్రికెట్ అభివృద్ధికి సంబంధించిన పనులు జరగలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. క్రికెట్ అభివృద్ధి కోసం బీసీసీఐ నుంచి హెచ్‌సీఏకు భారీగా నిధులు వచ్చినా.. హైదరాబాద్‌లో మాత్రం క్రికెట్ అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని.. అలానే హైదరాబాద్‌లో క్రికెట్ కోసం ఎలాంటి కొత్త ఆస్తులు కొనలేదని తెలిపారు. పైగా ఉన్న వాటిని అభివృద్ధి చేయలేదని ఆరోపించారు.. గత 10 ఏళ్లలో హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్ల ఆస్తులు మాత్రం బాగా పెరిగాయని ఫిర్యాదులో ఆరోపించారు. దీనిని బట్టి హెచ్‌సీఐఏలో అవినీతి జరిగిందని స్పష్టంగా అర్థం అవుతుందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ సీఐడీకి ఫిర్యాదు చేసింది. ఈ మొత్తం అవినీతి బాగోతంపై సీఐడీ ఫోకస్ పెట్టింది. కస్టడీ విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.



# విజయ్ దేవరకొండకు తీవ్ర అనారోగ్యం

## ఆసుపత్రిలో చేరిక!

**హైదరాబాద్, మహా:** టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండకు డెంగ్యూ రావడంతో ఆసుపత్రిలో చేరినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విజయ్ పరిస్థితి తీవ్ర జ్వరంగా ఉన్నట్లు సమాచారం. ఈ నెల 20వ తేదీన ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదిలా ఉండగా విజయ్ దేవరకొండ కొత్త చిత్రం 'కింగ్‌డమ్' ఈ నెల 31న విడుదల కానుంది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రాబోతున్న ఈ మూవీలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది.

### సెమీ కండక్టర్, హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్

# ఏర్పాటుకు అనుమతినివ్వండి

## కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎంపీలు పోరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, రామ సహాయం రఘురామరెడ్డి, సురేశ్ షెట్కార్ కూడా హాజరయ్యారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి సంజయ్ కుమార్, ఆర్ అండ్ బీ కార్యదర్శి వికాస్ రాజ్, డాక్టర్ గౌరవ్ ఉప్పల్ కూడా ఈ భేటీలో ఉన్నారు.

**రూ.8వేల కోట్లతో రీజినల్ రింగ్ రైలు**

రూ.8 వేల కోట్ల విలువైన రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. రీజినల్ రింగ్ రైలుతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానత పెరగడంతో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన స్టేషన్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టుతో గ్రామీణ పేదరికం తగ్గడంతో పాటు పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. దీంతోపాటు కాజీపేటలో రైల్వే డివిజన్ ఏర్పాటు చేసి, ప్రయాణికులకు వేగవంతమైన సేవలు అందించాలన్నారు.

**రీజినల్ రింగ్ రైలు, డ్రైపోర్ట్ అను సంధానం**

రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు గ్రామీణ, పట్టణ ప్రాంతాల అనుసంధానాన్ని పెంచి, హైదరాబాద్‌లో రద్దీ తగ్గిస్తుందని సీఎం తెలిపారు. హైదరాబాద్ డ్రైపోర్ట్ నుంచి బందరు ఓడరేవుకు రైలు మార్గం మంజూరు చేయాలని కోరారు. ఈ మార్గం ఔషధాలు, ఎలక్ట్రానిక్స్, ఆహార ఉత్పత్తుల ఎగుమతులకు ఉపయోగపడుతుందని వివరించారు. ఇందులో భాగంగా వికారాబాద్ కృష్ణా (122 కి.మీ. అంచనా వ్యయం రూ.2,677 కోట్లు), కల్వకుర్తి మాచర్ల (100 కి.మీ. అంచనా వ్యయం రూ.2 వేల కోట్లు), డోర్నకల్ గద్వాల (296 కి.మీ. అంచనా వ్యయం రూ.6,512 కోట్లు), డోర్నకల్ మిర్యాలగూడ (97 కి.మీ. అంచనా వ్యయం రూ.2,184 కోట్లు) మార్గాలను వంద శాతం రైల్వే శాఖ వ్యయంతో మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ మార్గాలు రాష్ట్రంలో అనుసంధానత, పారిశ్రామిక, వ్యవసాయ ఎగుమతులకు ఎంతో దోహదపడతాయని తెలిపారు.

**మంత్రి సానుకూల స్పందన**

సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణలో సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ పార్క్, రైల్వే ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చే విషయంలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి, ఉపాధి అవకాశాలకు దోహదపడతాయని సీఎం అభిప్రాయపడ్డారు.

# బండి సంజయ్‌కి సిట్ పిలుపు

## 24న ఫోన్ ట్యాపింగ్ పై వాంగ్మూలం

### కేసీఆర్ పాపమే ఈ లవ్ లెటర్

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని సిట్ అధికారులు విచారిస్తూనే ఉన్నారు. దర్యాప్తులో భాగంగా గతంలో తమ ఫోన్లు ట్యాపింగ్‌కు గురైనట్లు ఆరోపించి ఫిర్యాదు చేసిన నేతలకు కూడా సిట్ అధికారులు నోటీసులు ఇచ్చి, వారి వాగ్మూలం రికార్డు చేస్తున్నారు. తాజాగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కూమార్‌కు సైతం సిట్ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈ నెల 24న లేక్‌వ్యూ గెస్ట్ హౌస్‌లో విచారణకు హాజరు కావాలని సిట్ నోటీసుల్లో పేర్కొంది. ఆయన పీఆర్ వో , పీఏల ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయి. కేసీఆర్ పాపమే తనకు ఈ లవ్ లెటర్ అని, తన ఫోన్ ట్యాపింగ్ వేధింపులపై స్టేట్‌మెంట్ ఇస్తానన్నారు.



# పరుష పదజాలానికి బ్రాండ్ అంబాసిడర్లు మీరే


## బీఆర్ఎస్‌పై ఎంపీ రఘువీర్ రెడ్డి ఫైర్

**మిర్యాలగూడ, మహా:** మాజీ మంత్రి కేటీఆర్‌పై నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి మండిపడ్డారు. గురువారం ఆయన కార్యాలయం నుండి మాట్లాడుతూ.. రాజకీయాల్లో పరుష పదజాలానికి బ్రాండ్ అంబాసిడర్లు అయ్యారని, లీడర్లు కావాలనుకునేటోళ్లకు బూతులు, పిచ్చి వాగుడును ట్రెండ్‌గా మార్చారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ దిగిపోయే నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దివాళా తీయించింది మీరు కాదా? అని ప్రశ్నించారు. రూ. 42వేల కోట్ల పెండింగ్ బిల్లులు వదిలేసిపోయారని, అందినకాడికి అమ్ముకుని పరారైన సంగతి మర్చిపోయారా? అని నిలదీశారు. రాయలసీమను సస్యశ్యామలం చేస్తానని చెప్పింది కేసీఆర్ కాదా? అని అడిగారు. 3 వేల క్యూసెక్కుల నీరు వృథాగా పోతుందని, తీసుకెళ్లండని చంద్రబాబుకు చెబితేనే బనకచర్ల ప్రాజెక్టు మొదలుపెట్టారని క్లారిటీ ఇచ్చారు.

# కేసీఆర్ కుటుంబంపై కోర్టులకు వెళ్తాం

- బీఆర్ఎస్ పోవడం వల్లే ఫోన్ ట్యాపింగ్ బయటపడింది
- సిట్ విచారణలో వాంగ్మూలం అనంతరం తీన్మార్ మల్లన్న
- తన వద్ద ఉన్న ఆధారాలను సిట్ అధికారులకు అందించానని వెల్లడి

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ ప్రభుత్వం పోవడం వల్లే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం బయటపడిందని... లేకపోతే ఆ అరాచకం ఇప్పటికీ కొనసాగేదని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. కేసీఆర్ తో పాటు ఈ దారుణానికి పాల్పడిన ప్రతి ఒక్కరినీ శిక్షించాలని డిమాండ్ చేశారు. సిట్ పిలుపుతో తీన్మార్ మల్లన్న ఈరోజు విచారణకు హాజరయ్యారు. విచారణ సందర్భంగా మల్లన్న స్టేట్మెంట్ ను సిట్ అధికారులు నమోదు చేసుకున్నారు. విచారణ అనంతరం మీడియాతో తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం తనతో పాటు పలువురి ఫోన్లను ట్యాప్ చేసిందని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కు సంబంధించి తన వద్ద ఉన్న ఆధారాలను అధికారులకు అందించానని... తన వద్ద మరికొంత సమాచారం ఉందని, అది త్వరలోనే అధికారులకు పంపిస్తానని చెప్పారు. అవసరమైతే మరోసారి పిలుస్తామని అధికారులు చెప్పారని తెలిపారు. వ్యక్తిగత హక్కులను హరించిన కేసీఆర్ కుటుంబంపై, అప్పటి అధికారులపై చర్యల కోసం కోర్టులను ఆశ్రయిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితుడేనని... ఈ ప్రభుత్వంలో అలాంటి దుర్మార్గాలు జరగవనే సంకేతాలను ప్రజలకు ముఖ్యమంత్రి ఇవ్వాలన్నారు. ఈ కేసులో సిట్ ఏ మేరకు న్యాయం చేయగలదో చూస్తామన్నారు.




# ఏ చౌక్కా వేసుకున్నా ఇందిరమ్మ ఇళ్ళు పక్కా

## 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ఖమ్మం, మహా:** ఏ చౌక్కా వేసుకున్నా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ళు పక్కా అని, ఇందిరమ్మ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా కొనసాగిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన అజెండా తెలిపారు. గురువారం పెనుబల్లి మండలం పాత కుప్పెనకుంట్ల గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన కొత్త గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్, ఉగాది నుండి రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, ఆరోగ్యశ్రీ పరిధిని రూ. 10 లక్షలకు పెంపు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇల్లు ప్రతి పేదవాడి సొంతం అయ్యేలా ఉగాది నుండి సన్న బియ్యం పథకాన్ని దేశంలో ఎక్కడా లేని విధంగా అమలు చేస్తూ, మొదటి విడతలో రూ. 22,500 కోట్లతో 4.5 లక్షల ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. ఇది ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, అర్హులు అధైర్యపడాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా పథకంలో పెట్టుబడి సాయం ఎకరాకు రూ. 10,000 నుంచి రూ. 12,000కు పెంచి, రైతుల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు.



# చిల్లర మాటలు బంద్ చెయ్

- దుబాయ్ లో ఎవరో చనిపోతే మాకేం సంబంధం?
- కేటీఆర్‌పై సీఎం చేసిన చెత్త వ్యాఖ్యలు ఖండిస్తున్నా
- మాజీ మంత్రి హరీశ్ రావు మండిపాటు



బనకచర్ల ప్రాజెక్ట్ ఎజెండాలో ఉన్నదని ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామ్మోహన్ నాయుడు చెప్పారు. రేవంత్ రెడ్డి ఏమో బనకచర్ల అసలు చర్చకు రాలేదని అంటున్నాడు. డ్రగ్స్, గంజాయి అంటూ మోకాళ్లకు బోడి గుండుకు ముడి పెట్టే ప్రయత్నం చేస్తున్నాడని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు.

**తెలంగాణ ద్రోహి రేవంత్ రెడ్డి..**

ముఖ్యమంత్రి మాట్లాడితే రాష్ట్ర ప్రయోజనాల గురించి మాట్లాడాలి. కేసీఆర్‌కు ఉన్న ఇమేజ్ రేవంత్ రెడ్డికి రాదు. నా ఎత్తు గురించి మాట్లాడిన నా అంత ఎత్తు అయితే రేవంత్ రెడ్డికి రాదు. రేవంత్ రెడ్డికి నిజాయితీ ఉంటే అసెంబ్లీ పెట్టాలి. అసెంబ్లీలో మా మైక్ కట్ చెయ్యకుండా నిజాయితీగా అన్ని అంశాలపైన చర్చకు బీఆర్ఎస్ రెడీగా ఉందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణ ద్రోహి రేవంత్ రెడ్డి. ముఖ్యమంత్రి అయిన తరువాత జై తెలంగాణ అంటాడేమో అనుకున్నాము. జై కర్ణాటక , జై మహారాష్ట్ర అని ఆ రాష్ట్ర నాయకులు అనడం లేదా. కర్ణాటకకు చెందిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జై తెలంగాణ అనలేదా. కేటీఆర్ అనర్గళంగా ఇంగ్లీష్ మాట్లాడుతారు. రాష్ట్ర ప్రయోజనాలు ప్రపంచం ముందు ఉంచాడు. నీలా కేటీఆర్ బ్యాగ్‌లు మోయలేదు. నీ చుట్టూ ఉన్నవారు బ్యాగ్‌లు మోసేవారు. పరిపాలన అంటే బ్యాగ్‌లు మోసుడు కాదు రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు చురకలంటించారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో మలేరియా, డెంగ్యూ వంటి రోగాలతో గురుకుల పాఠశాల విద్యార్థులు హాస్పిటల్‌లో ఉంటున్నారు. గ్రామాల్లో పాలన పడకేసింది. జూబ్లీ హిల్స్ ప్యాలెస్, కమాండ్ కంట్రోల్ బిల్డింగ్‌లోనే పాలన చేస్తున్నావు. సచివాలయంకు ఎందుకు పోవడం లేదు రేవంత్ రెడ్డి. రోజు ప్రజలను కలుస్తా అని మాట ఇచ్చావు కదా..? అని రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు నిలదీశారు

# ముగ్గురి వద్దనే వెయ్యి కోట్లు

## వీళ్లు దొరికినోళ్లు..దొరకనోళ్లు ఇంకెంత మందో ?

**హైదరాబాద్, మహా :** రాజకీయ పార్టీలకు ప్రధాన ప్రచారాస్త్రంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టు నేతలకూ, నీటి పారుదల శాఖలోని అధికారులకూ ఏటీఎంల మారిందన్ విషయం స్పష్టమవుతోంది. కొందరు నీటి పారుదల శాఖ అధికారుల ఇళ్ళపై గత కొన్నాళ్ళుగా ఏసీబీ అధికారులు జరుపుతున్న దాడులు, వెలుగులోకి వస్తున్న ఆస్తుల వివరాలు చూస్తే ఆశ్చర్యపోవడం సామాన్యుల వంతు అవుతుంది. నేతలతో పాటు అధికారులకూ కాళేశ్వరం ప్రాజెక్టు వరంగా మారిందన్న విషయం స్పష్టంగా తేలిపోతోంది. ప్రాజెక్టును అడ్డం పెట్టుకుని కొంత మంది అధికారులు కోట్ల రూపాయల నిధులను కూడబెట్టారనడానికి ఏసీబీ గత కొంతకాలంగా జరుపుతున్నదాడులతో స్పష్టమవుతుంది.ఇప్పటి వరకూ కాళేశ్వరం ప్రాజెక్టులో పనిచేసిన అధికారులందరూ కోట్లు కూడబెట్టుకున్నారు. దీన్ని బట్టిచూస్తుంటే కాళేశ్వరం ప్రాజెక్టు అధికారులకు కాసుల వర్షం కురిపించిందని ఏసీబీ దాడుల ద్వారా అర్థమవుతుంది. ఇప్పటి వరకూ ముగ్గురు నీటి పారుదల శాఖ అధికారులపై ఏసీబీ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ముగ్గురి నుంచి దాదాపు వెయ్యి కోట్ల రూపాయల అక్రమ ఆస్తులు కనుగొన్నారంటే ఏ రేంజ్ లో అవినీతికి పాల్పడ్డారో అర్థమవుతుంది. అధికారులే ఇంత సంపాదిస్తే రాజకీయ నేతలు ఎంత సంపాదించి ఉంటారన్నది ప్రస్తుతం చర్చగా మారింది. సోదాలలో ప్లాట్లు, ఫ్లాట్లు, వ్యవసాయ భూములు, విల్లాలు, ఖరీదైన కార్లు, బంగారం, వెండి ఆభరణాలు చూసి ఏసీబీ అధికారులే అవాక్కవుతున్నారు. ఈ రేంజ్ లో సంపాదించారంటే కాళేశ్వరం ఎంత వరంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

**మురళీధరావు ఆస్తులు చూస్తే**

నీటి పారుదల శాఖ మాజీ ఈఎన్సీ మురళీధరావు ఇంట్లో జరిపిన సోదాల్లో కోట్లాది రూపాయల అక్రమార్జన బయట పడిందని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. ఆయన ఆస్తుల విలువ ఆరువందల వందల కోట్ల రూపాయలకు పైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ లో విలువైన భూములు, ఇంటి స్థలాలతో పాటు పవర్ ప్రాజెక్టు, ఖరీదైన ఫ్లాట్లు, ఇంటి స్థలాలు, విల్లాతో పాటు బంగారం, వెండి ఆభరణాలను ఉన్నట్లు కనుగొన్నారు. ఇక బ్యాంకు లాకర్లను కూడా తెరవాల్సి ఉంది. లాకర్లలో ఎంత మేర ఆస్తులు బయట పడతాయన్నది తేలాల్సి ఉంది. శంకర్ పల్లి మోకిలాలో 6,500 చదరపు గజం స్థలం ఉంది. అలాగే హైదరాబాద్ శివార్లలో పదకొండు ఎకరాల సాగు భూమి కూడా ఉంది. జహీరాబాద్ లో టూ కేవీ సోలార్ పవర్ ప్రాజెక్టు, బంజారాహిల్స్, యూసఫ్ గూడ, కోకపేట, బేగంపేట్లో నాలుగు ఫ్లాట్లు, నాలుగు ఇళ్లస్థలాలను ఉన్నట్లు సోదాల్లో ఏసీబీ అధికారులు కనుగొన్నారు. వరంగల్, కోదాడా ప్రాంతంలోనూ అపార్ట్ మెంట్లతో పాటు కొండాపూర్ లోని ఖరీదైన విల్లా ఉంది. అయితే లాకర్ ఓపెన్ చేస్తే మరిన్ని ఆస్తులు బయటపడే అవకాశముందని భావిస్తున్నారు.

**నూనె శ్రీధర్ ఆస్తులు రెండు వందల కోట్లు**


ఇక కొన్నాళ్ల క్రితం మాజీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూనె శ్రీధర్ అక్రమార్జనను కూడా ఏసీబీ అధికారులు వెలికితీశారు కాళేశ్వరం మాజీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గా ఉన్న నూనె శ్రీధర్ భారీగా ఆస్తులను కూడబెట్టినట్లు సోదాల్లో కనుగొన్నారు. అమీర్ పేటలో కమర్షియల్ కాంప్లెక్స్ తో పాటు ఇక తెల్లాపూర్ లో విల్లాతో పాటు కరీంనగర్ లో మూడు ఇళ్లు, షేక్ పేట్ లో ఒక ఫ్లాట్, ఇంకా వ్యవసాయ భూములున్నాయని ఏసీబీ అధికారులు తెలిపారు. ఇవి కాకుండా కరీంనగర్, హైదరాబాద్, వరంగల్ లలో పందొమ్మిది ఓపెన్ ప్లాట్లు ఉన్నాయని ఏసీబీ దర్యాప్తులో వెల్లడయింది. దీంతో పాటు పదహారు ఎకరాల వ్యవసాయ భూమి కూడా ఉంది. ఇక కార్లు, బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు కూడా ఉన్నాయి. వీటి మొత్తం ఆస్తుల విలువ రెండు వందల కోట్లకుపైగానే ఉంటుందని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. లాకర్లు ఓపెన్ చేసిన తర్వాత మరిన్ని ఆస్తులు బయటపడ్డాయి.

**హరిరామ్ ఆస్తులివీ**

కాళేశ్వరం మాజీ ఈఎన్సీ హరిరామ్ ఇంటిపై ఏసీబీ సోదాలు కొంతకాలం క్రితం జరిగాయి. హరిరాం ఇళ్లు, ఆయన బంధువులు, సన్నిహితుల ఇళ్లపై ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. . ఈ ఆస్తుల విలువ రెండు వందల కోట్ల రూపాయలకు పైగానే ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేశారు. హరిరామ్ భార్య కూడా ఇంజనీరింగ్ అధికారిగా పనిచేస్తుండటంతో ఆమె ఇళ్లలోనూ తనిఖీలను నిర్వహించారు. హరిరామ్ కు శామీర్ పేట్ లో ఒక విల్లాతో పాటు, కొండాపూర్ లో విల్లా, శ్రీనగర్ కాలనీ లో ఒక ఫ్లాట్ తో పాటు మాదాపూర్ లోనూ మరొక ఫ్లాట్ ఉందని తేల్చారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోనూ కమర్షియల్ స్పేస్ ను హరిరామ్ కొనుగోలు చేసినట్లు ఏసీబీ అధికారులు కనుగొన్నారు. మర్కూక్ మండలంలో ఇరవై ఎనిమిది ఎకరాల వ్యవసాయ భూమితో పాటు, పటాన్ చెరువులో అర ఎకరం భూమి, హైదరాబాద్ లోని శ్రీనగర్ కాలనీలో రెండు ఇండిపెండెంట్లు ఇళ్లు, బొమ్మల రామారంలో ఒక ఫామ్ హౌస్, కుత్బుల్లాపూర్ లో ఓపెన్ ఫ్లాట్, మిర్యాలగూడలో ఒక ఫ్లాట్, మామిడితోట, రెండు బీఎండబ్ల్యూ కార్లు, బంగారు ఆభరణాలు, నగదు కూడా ఉన్నట్లు గుర్తించారు. ఇలా ముగ్గురి ఆస్తుల విలువే మార్కెట్ విలువ వెయ్యి కోట్ల రూపాయలకు పైగానే ఉండటంతో కాళేశ్వరం కాసులు కురిపించిందని చెప్పకనే చెప్పొచ్చు. వీరే కాకుండా ఇరిగేషన్ శాఖలో మరికొంత మంజి కాళేశ్వరాన్ని అడ్డు పెట్టుకుని ఆడ్డగోలుగా ఆస్తులను కూడ బెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా ఆయా అధికారులపై ఏసీబీకి లిఖిత పూర్వక ఫిర్యాదులు కూడా అందుతున్నాయి. వస్తున్న ఫిర్యాదులను పరిశీలిస్తున్న అధికారులు వారిపై నిఘా పెట్టారు. త్వరలోనే మరికొంత మంది ఇళ్ళు, కార్యాలయాలు, మిగతా చోట్ల దాడులు జరిపి కేసులను నమోదు చేసేందుకు సన్నద్ధవుతున్నారు. మొత్తంగా కాళేశ్వరం కూలేశ్వరం కాగా అధికారులు మాత్రం ఊహించనంత సంపాదనను కూడ బెట్టుకున్నారన్నది వాస్తవం.

# వంశీచంద్ రెడ్డికి కీలక బాధ్యతలు

## దేశ వ్యాప్తంగా డీసీసీల నియామక ప్రక్రియ బాధ్యతలు
## ఖర్గే ఆదేశాలతో ఉత్తర్వులు



**హైదరాబాద్, మహా:** ఏఐసీసీ లో తెలంగాణ నేతకు కీలక ఇంచార్జి పదవి దక్కింది. ఏఐసీసీ ఇంచార్జి గా, సంస్థాగత నిర్మాణంలో కీలకమైన డీసీసీల నియామక బాధ్యతను వంశీచంద్ కు ఏఐసీసీ అప్పగించింది. ఇప్పటికే సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులుగా ఉన్న వంశీచంద్ రెడ్డి కి ప్రస్తుతం దేశ వ్యాప్తంగా డీసీసీ ల నియామక ప్రక్రియ బాధ్యతలు అధ్యక్షులు ఖర్గే అప్పగించారు. గతంలో ఏఐసీసీ కార్యదర్శి గా ఆర్గనైజేషన్ బాధ్యతలు చూసిన వంశీచంద్ కు దేశవ్యాప్తంగా ఉన్న డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియతోపాటు వారి పనితీరు మరియు సంస్థాగత నైపుణ్యాన్ని ఆధ్యయనం చేసే బాధ్యత అప్పగించారు. పార్టీ లో సంస్థాగత నిర్మాణ బాధ్యతలు వంశీచంద్ రెడ్డికి అప్పగించడం పట్ల తెలంగాణ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ నేతలు అభినందించారు. వంశీ చంద్ రెడ్డి నియామకం పట్ల ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆదిలాబాద్ కాంగ్రెస్ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

# హైకోర్టులో రేవంత్ రెడ్డికి ఊరట

## గచ్చిబౌలి పీఎస్‌లో నమోదైన కేసు కొట్టేవేత
## సొసైటీ స్థలాన్ని ఆక్రమించుకునే ప్రయత్నం చేశారని కేసు

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో హైకోర్టులో ఊరట లభించింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీసు స్టేషన్‌లో ఆయనపై నమోదైన కేసును ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. సొసైటీ స్థలాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారంటూ రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మయ్యపై 2016లో అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ కేసును కొట్టివేయాలంటూ 2020లో రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గత నెల 20న వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు, ఈరోజు ఉత్తర్వులు వెలువరించింది. ఘటన జరిగిన సమయంలో రేవంత్ రెడ్డి అక్కడ లేరని తేలినట్లు తెలిపింది. ఫిర్యాదుదారు చేసిన ఆరోపణల్లో సరైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంది.

## మంత్రి వివేక్ వెంకటస్వామిపై
# దాడి యత్నం

- మెదక్‌లో మక్కబుట్ట విసిరిన అగంతకుడు
- అప్రమత్తమైన పోలీసులు

**మెదక్, మహా:** రాష్ట్ర కార్మిక మరియు గనులు శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి చేదు అనుభవం ఎదురైంది. ఇందిరమ్మ ఇల్లు రాలేదనే కోపంలో ఓ వ్యక్తి మక్కబుట్ట విసిరి దాడికి యత్నించాడు. గురువారం మెదక్‌లో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి వివేక్, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పాల్గొన్నారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు.. ఆ వ్యక్తిని సభ నుంచి బయటికి తరలించి, అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతన్ని మందలించి వదిలేసినట్టు సమాచారం. కాగా అర్హులకు తప్పకుండా ఇళ్ళు అందిస్తామని, ఈ విడతలో రాకపోతే తరువాతి విడతలో అయినా తప్పక అందిస్తామని మంత్రి వివేక్ హామీ ఇచ్చారు.

## మోదీ రిటైర్మెంట్‌పై ఆర్ఎస్ఎస్
# హింట్ ఇచ్చేసింది

## బీజేపీకి ఇదే గోల్డెన్ ఛాన్స్..
## కర్నాటక సీఎం సిద్ధరామయ్య



**బెంగుళూరు, మహా:** 75 ఏళ్లు నిండిన రాజకీయ నాయకుల రిటైర్మెంట్‌పై ఇటీవల రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీనే ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. ఓ దళితుడిని ప్రధానమంత్రిని చేయడానికి బీజేపీకి ఇదొక సువర్ణావకాశం అని సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. అయితే ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లిఖార్జున ఖర్గేను కాంగ్రెస్ తమ ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించి వెనుకబడ్డ తరగతులు ఎస్సీ, ఎస్టీ పట్ల నిబద్ధతను చాటుకోవాలని కర్ణాటక రాష్ట్ర బీజేబీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర ఇటీవల అన్నారు. దీనికి తాజాగా స్పందించిన సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేశారు. "మల్లికార్జున ఖర్గే ఏఐసీసీ అధ్యక్షుడు మాత్రమే కాదు, ఆయన ఓ గొప్ప రాజనీతిజ్ఞుడు. ఆయన ఎదుగుదలకు ఏనాడూ దళిక కార్డు వాడలేదు. దశాబ్దాల అంకితభావం, ప్రజాసేవ ఫలితంగానేఅ ఖర్గే ఈ స్థాయికి ఎదిగారు. అంతిమంగా కాంగ్రెస్‌లో ప్రధానమంత్రి అభ్యర్థి నిర్ణయించేది మా పార్టీయే కానీ బీజేపీ కాదు" అని సిద్ధరామయ్య అన్నారు. అలాగే బీజేపీ చీఫ్ విజయేంద్ర కాంగ్రెస్ గురించి మాట్లాడుతూ సమయం వృథా చేసుకోకుండా, తమ పార్టీపై దృష్టి పెట్టాలని కోరారు. "మోదీ పదవీ విరమణ చేస్తున్నట్లు మోహన్ భాగవత్ ఇప్పటికే సంకేతాలిచ్చారు, ఆయనకు ఇప్పుడు 75ఏళ్లు. ఇక దళితుడిని తదుపరి ప్రధానమంత్రిగా చేయడానికి బీజేబీకి ఇదొక సువర్ణావకాశం. ఈ చొరవ మీతోనే ఇది ప్రారంభించండి. ఇతరులకు ఉపన్యాసాలు ఇచ్చే బదులుగా, బీజేపీ ప్రధానమంత్రి అభ్యర్థిగా దళిత నాయకుడిని మీరే ఎందుకు ప్రతిపాదించకూడదు? గోవింద్ కర్జోల్ లేదా చలవాడి నారాయణస్వామి పేర్లను మీరు ప్రతిపాదిస్తే, మిమ్మల్ని తొలుత నేనే అభినందిస్తా" అని ఆయన అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా విజయేంద్ర కుర్చీకే ఎలాంటి గ్యారెంటీ లేదని, అలాంటి ఆయన కాంగ్రెస్ పార్టీ ప్రధానమంత్రి అభ్యర్థిపై మాట్లాడడం హాస్యాస్పదం అని సిద్ధరామయ్య పేర్కొన్నారు.

# మోహం చాటేసిన మేఘం

## భారీగా తగ్గిన పంట సాగు విస్తీర్ణం
## ఈ సీజన్ లో ఇప్పటివరకు కేవలం 46% భూముల్లోనే పంట సాగు చేసిన రైతులు

**హైదరాబాద్, మహా :** మున్నెన్నడూ లేని విధంగా రుతు పవనాలు రాష్ట్రంలోకి ముందుగానే ప్రవేశించినప్పటికీ రైతాంగం సాగుకు పూర్తి స్థాయిలో సమాయత్తమైన సమయంలో కురవాల్సిన వర్షాలు కురవడం లేదు. దీంతో రైతాంగం సాగుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చినుకు కోసం చరకోరపు పక్షుల్లా రైతులు ఎదురు చూస్తున్నారు. విత్తునిత్తే సమయంలో కురవాల్సిన వర్షాలు లేకపోవడంతో రైతులు సాగు విషయంలో వెనక్కు తగ్గారు. ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాలు, పంట నష్టాలతో తీవ్ర అప్పుల పాలైన రైతాంగం ప్రకృతి కూడా సహకరించక పోవడంతో ఉన్నంతలో సర్దుకు పోదాం అన్న నిర్ణయానికి వచ్చారు. తద్వారా గతంలో కంటే రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. 132 లక్షల ఎకరాలు సాగు చేయాల్సి ఉండగా, కేవలం 61 లక్షల ఎకరాల్లోనే రైతులు పంట సాగు చేశారని వ్యవసాయ శాఖ నివేదిక విడుదల చేసింది. ప్రధాన పంట అయిన వరి విస్తీర్ణం 62.78 లక్షల ఎకరాలు సాగు కావాల్సి ఉండగా కేవలం 7.78 లక్షల (12.46%) ఎకరాల్లో మాత్రమే సాగు చేసిన రైతులు. 48.93 లక్షల ఎకరాలు ఉండే పత్తి 38.57 లక్షల ఎకరాల్లో, 6.70 లక్షల ఎకరాలు ఉండే కంది 3.44 లక్షల ఎకరాల్లో, 5.21 లక్షల ఎకరాలు ఉండే మొక్కజొన్న 4.50 లక్షల ఎకరాల్లో, 4.20 లక్షల ఎకరాలు ఉండే సోయాబీన్ 3.31 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు చేసిన రైతులు. వీటితో పాటు పప్పు ధాన్యాలు, నూనె గింజల పంట సాగు కూడా తగ్గిపోయిందని వ్యవసాయ నివేదికలో స్పష్టం చేసింది. ఊహించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడం వల్లనే పంట సాగు విస్తీర్ణం తగ్గిందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికిప్పుడు వర్షాలు కురిస్తే మొక్కజొన్న లాంటి పంటలను విత్తే అవకాశాలున్నాయి.

# సాగు నీటిని విడుదల చేయాలి : మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

**మిర్యాలగూడ, మహా:** నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టుకు వెంటనే నీటిని విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ డ్యామ్ లో 560 అడుగుల నీటి మాత్రం ఉందని, ఖమ్మం జిల్లాలో ఆయకట్టుకు నీరు విడుదల చేశారని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని ఆయకట్టు పరిధిలో రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారని, ఇప్పటికే దుక్కి దున్ని, నారు మడులు వేసుకొని నాట్లు వేసుకునేందుకు సిద్ధమవుతున్నార న్నారు. పంటలు సాగు చేసుకునేందుకు పెట్టుబడులకు అవసరమైన రైతు భరోసా, రైతు రుణమాఫీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.




# పరిషత్ సందడి..

- ఉమ్మడి జిల్లాలో 69 జడ్పీటీసీ, 579 ఎంపీటీసీ స్థానాలు
- ఈ నెలాఖరులో నోటిఫికేషన్ వచ్చే ఛాన్స్
- ఎన్నికలకు సన్నద్ధమవుతున్న ప్రధాన రాజకీయ పార్టీలు
- రిజర్వేషన్ల ఖరారుపైనే సర్వత్రా ఉత్కంఠ




**ఆదిలాబాద్, మహా :** పరిషత్ సమరానికి రంగం సిద్ధమవుతోంది. రాష్ట్రంలో తొలుత జడ్పీ, మండల పరిషత్ లకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు రాష్ట్రంలో ఆయా జిల్లాల వారీగా జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వం ప్రకటించిన స్థానాల ప్రకారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 579 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. 69 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. వీటికి ఎన్నికలు జరిగితే నలుగురు జిల్లా పరిషత్ అధ్యక్షులుగా..మరో 69మంది మండల పరిషత్ అధ్యక్షులుగా ఎన్నిక కానున్నారు. ఆయా స్థానాలకు త్వరలోనే రిజర్వేషన్లు సైతం ఖరారు కానుండగా.. ఈ నెలాఖరు వరకు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

**ఎన్నికల సందడి షురూ..**

జిల్లా, మండల పరిషత్ పాలకవర్గాలు ముగిసి దాదాపు ఏడాది గడిచిపోయింది. పాలకవర్గాల పదవీకాలం ముగిసిన ఆరు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా.. వివిధ కారణాలతో జాప్యం జరుగుతూ వచ్చింది. దీంతో జిల్లా స్థాయిలో కీలకమైన జిల్లా పరిషత్ పాలకవర్గం లేకపోవడంతో వివిధ నిధుల కోసం కేంద్రానికి తీర్మాణాలు పంపించడం అవరోధంగా మారింది. ప్రభుత్వం సైతం ఇది వరకే ఎన్నికలు నిర్వహించాలని భావించినా కార్యరూపం దాల్చలేదు. దీంతో ఆయా రాజకీయ పార్టీల నాయకుల్లో నిరుత్సాహం కనిపించింది. ఎన్నికలు నిర్వహిస్తే పదవుల్లో ఉండొచ్చనే ఉద్దేశంతో అనేక మంది వీటి కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. తాజాగా హైకోర్టు సూచనతో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేయడంతో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న ఆశావహుల్లో ఉత్సాహం వెల్లువిరుస్తోంది. ప్రభుత్వం విడుదల చేసిన స్థానాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లాలో 166 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. 20 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 127 ఎంపీటీసీ, 15 జడ్పీటీసీ స్థానాలు, నిర్మల్ జిల్లాలో 157 ఎంపీటీసీ, 18 జడ్పీటీసీ స్థానాలు ఉండగా మంచిర్యాల జిల్లాలో 129 ఎంపీటీసీ, 16 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ సారి కొత్తగా ఆదిలాబాద్ జిల్లాలో మాత్రమే మూడు జడ్పీటీసీ, 8ఎంపీటీసీ స్థానాలు పెరగనున్నాయి. ఇటీవల సొనాల, భోరజ్, సాత్నాల మండలాలుగా ఆవిర్భవించడంతో ఈ స్థానాలు పెంపు అనివార్యమైంది.

**రిజర్వేషన్లపైనే ఉత్కంఠ..**

ప్రభుత్వం తొలుత పరిషత్ ఎన్నికల నిర్వహణకు మొగ్గుచూపడంతో వీటి బరిలో నిలిచేందుకు సిద్ధమైన ఆశావహుల్లో రిజర్వేషన్ల టెన్షన్ పట్టుకుంది. ఎన్నికల్లో గెలుపోటములు పక్కన పెడితే తొలుత బరిలో నిలవాలంటే రిజర్వేషన్ కలిసి రావడం తప్పనిసరి కావడంతో ఆశావహుల్లో ఉత్కంఠ రేపుతోంది. ప్రభుత్వం ఇప్పటికే 42శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పడంతో గతంలో ఉన్న రిజర్వేషన్లు తారుతారయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ సారి కొత్తగా రిజర్వేషన్లను ప్రకటించడంతో ఏ మండలానికి ఏ రిజర్వేషన్ వస్తుందోనని టెన్షన్ పడుతున్నారు. తమకు కలిసి రాకుంటే వారి కుటుంబ సభ్యులు, లేదంటే వారి అనుచరులను బరిలో దింపాలని భావిస్తున్నారు. మరోపక్క ఇది వరకే అన్ని రాజకీయ పార్టీల ఆశావహులు పోటీకి సిద్ధమవుతున్నారు. పార్టీ గుర్తులపై పోటీ చేసే అవకాశం ఉండటం తో టికెట్ల కోసం ఇప్పటికే ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, కీలక నాయకులతో పాటు పార్టీ అధిష్టానాల ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ తీవ్రంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండటం కలిసి వస్తుందని భావిస్తున్నారు. ఎన్నికల్లో గెలిస్తే రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉండొచ్చని అనేక మంది ఆశలు పెట్టుకున్నారు. కొందరు ఏకంగా జడ్పీ పీఠాలను దక్కించుకోవాలని ఆరాట పడుతున్నారు. అతి కొద్ది రోజుల్లోనే రిజర్వేషన్లు ఖరారు కావడంతో పాటు నోటిఫికేషన్ కూడా వచ్చే అవకాశం ఉండటంతో ప్రధాన రాజకీయ పార్టీల్లో హడావుడి ప్రారంభమైంది. ఇప్పటికే ఆయా పార్టీల నుంచి బరిలో నిలిపే అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో ఆయా పార్టీల అధిష్టానాలు నిమగ్నమైనట్లు తెలుస్తోంది. మరోపక్క అధికార యంత్రాంగం సైతం ఇది వరకే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉంచింది.

# వేల్పూర్‌లో హై టెన్షన్

## రణరంగంగా మారిన బాల్కొండ పాలిటిక్స్
## కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య సవాళ్ల పర్వం
## కనువిప్పు కార్యక్రమానికి కాంగ్రెస్ పిలుపు.. తీవ్ర ఉద్రిక్తత



**బాల్కొండ, మహా:** బాల్కొండ నియోజకవర్గంలోని వేల్పూర్ మండల కేంద్రం రాజకీయ రణరంగంగా మారింది. ప్రస్తుతం వేల్పూర్‌లో పోలీసు పహార మధ్యలో హై టెన్షన్ నెలకొంది. అధికార కాంగ్రెస్ వర్సెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. ఇరు పార్టీల నేతలు పరస్పర సవాళ్లు విసురుకుంటూ నువ్వా.. నేనా.? అన్న చందంగా కయ్యానికి కాలు దువ్వినారు. అయితే జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పార్టీ తరపున వేల్పూర్‌లో నిర్వహించ తలపెట్టిన కనువిప్పు కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కాగా, గల్ఫ్ బాధితులను ఆదుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, గల్ఫ్ బాధితుల గోడు పట్టించుకోవడం లేదంటూ మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వంపైనా, సీఎం రేవంత్ రెడ్డి పైన చేసిన వ్యతిరేక వ్యాఖ్యల నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ గురువారం వేల్పూర్ లో కనువిప్పు కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టింది.

**నంగి దేవేందర్ రెడ్డిపై బీఆర్ఎస్ కార్యకర్తల దాడి..**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏం చేసిందో ప్రశాంత్ రెడ్డికి ప్రజల సమక్షంలోనే వివరించి ప్రశాంత్ రెడ్డికి కనువిప్పు కలిగిస్తామని మానాల మోహన్ రెడ్డి ప్రకటించారు. దీంతో ఒక్కసారిగా జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. వేల్పూర్‌లో కనువిప్పు కార్యక్రమం శాంతిభద్రతల సమస్యగా మారి పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకు అవకాశం ఉండటంతో సీపీ సాయిచైతన్య ఆదేశాలతో వేల్పూర్‌లో 163 బీఎన్ఎస్ యాక్ట్ అమలుకు ఆదేశించి కర్ఫ్యూ విధించారు. కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ రాష్ట్ర కార్యదర్శి నంగి దేవేందర్ రెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తల్లో కలిసిపోయి ఎమ్మెల్యే ఇంట్లోకి వెళ్లారు. ఎమ్మెల్యే కార్యకర్తలతో మాట్లాడుతుండగా నంగి దేవేందర్ రెడ్డి వారిలో కలిసి పోయి ఎమ్మెల్యే ఇంట్లో ఏం జరుగుతుందనే విషయాలను బయటనున్న కాంగ్రెస్ నాయకులకు తెలిసే విధంగా లైవ్ వీడియో ఆన్‌లో ఉంచినట్లు బీఆర్ఎస్ కార్యకర్తలు గుర్తించి దేవేందర్‌ను అక్కడే చితక బాదారు.

# ఒక్క లెటర్ పంపితే భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరినట్టే

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్

### తుదిదశలో భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం

### ఆగస్టు 1 నుంచి కొత్త టారిఫ్ విధానాలు

**మహా:** భారత్‌తో అమెరికా వాణిజ్య ఒప్పందం తుదిదశకు చేరుకుందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించారు. ఒక్క లెటర్ పంపితే ఇండియాతో డీల్ కుదిరినట్టే అని స్పష్టం చేశారు. బుధవారం బహ్రెయిన్ క్రౌన్ ప్రిన్స్ సల్మాన్ బిన్ హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫాతో ద్వైపాక్షిక సమావేశం సందర్భంగా ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన భారత్‌తో ట్రేడ్ డీల్ గురించి మాట్లాడారు. ఆగస్టు 1 నుంచి అమెరికా విధించే టారిఫ్‌లు అమల్లోకి రానున్నాయి. ఆ రోజు తమకు ఎంతో కీలకమైనదని, అలాగే తమ దేశానికి చాలా సంపద రానున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. 'ఇప్పటి వరకు అనేక దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నాం. మేం 100 బిలియన్ డాలర్లకు పైగా సేకరించాం. మంగళవారం కూడా మరో దేశంతో ఒప్పందం కుదిరింది. ఇప్పుడు భారత్‌తో మరో డీల్ ఓకే కానుంది. ఆగస్టు 1న అమెరికా ఖజానాకు పెద్ద మొత్తంలో డబ్బు వచ్చే రోజు అవుతుంది. ఇప్పటివరకు స్టీల్, ఆటోమొబైల్ తప్ప టారిఫ్‌లు పెద్దగా అమల్లోకి రాలేదు. అయితే ఆ రోజుతో భారీ మార్పులు ఉండనున్నాయి' అని ట్రంప్ వెల్లడించారు. భారత్ మార్కెట్‌లలోకి అమెరికాకు పూర్తి ప్రవేశం కల్పించేలా రెండు దేశాల మధ్య చర్చలు జరుపుతున్నాయని ట్రంప్ తెలిపారు. 'ఇప్పటివరకు మా ఉత్పత్తులకు భారత్ సహా పలు దేశాల్లో ప్రవేశం లేదు. ఇప్పుడు టారిఫ్‌ల కారణంగా ఆయా దేశాలు ప్రవేశం కల్పిస్తున్నాయి. భారత్‌తో డీల్ చివరి దశలో ఉంది. ఒక లెటర్ పంపితే అది ఉత్తమ డీల్ కానుంది. ఆ లేఖలో 30శాతం, 35శాతం, 25శాతం, 20శాతం టారిఫ్‌లు చెల్లించాలని చెబుతాం' అని ట్రంప్ వెల్లడించారు.

**20శాతం టారిఫ్ తప్పదా?**

ట్రంప్ చెప్పిన మాటలను పరిశీలిస్తే భారత్‌పై టారిఫ్‌లు 20శాతం నుంచి 35 శాతం మధ్యలో ఉండొచ్చని తెలుస్తోంది. ఇండోనేషియాపై అమెరికా 19శాతం టారిఫ్ ను విధించింది. ఈ క్రమంలో అమెరికాతో ఉన్న ద్వైపాక్షిక బంధం నేపథ్యంలో మన దేశంపై అంతకంటే తక్కువగా టారిఫ్‌లను ట్రంప్ విధిస్తారని భారత్ భావించింది. కానీ అది సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. అమెరికా ఉత్పత్తులపై భారతదేశం విధిస్తున్న అధిక టారిఫ్‌లు ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాల్లో ప్రధాన సమస్యగా ట్రంప్ గతంలో కూడా పలుమార్లు చెప్పిన విషయం తెలిసిందే. 'భారత్‌తో మంచి సంబంధాలు ఉన్నప్పటికీ, ప్రపంచంలోనే అత్యధిక టారిఫ్‌లు విధించే దేశాల్లో భారత్ ఒకటి. అయితే, ఇండియా టారిఫ్‌లను తగ్గించేందుకు సన్నద్ధంగా ఉన్నారు' అని ఇటీవల బ్రైట్‌బార్ట్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ పేర్కొన్నారు. భారత్, అమెరికా మధ్య జరుగుతున్న ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు (బీటీఏ) ప్రధాని నరేంద్ర మోదీ, డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాల మేరకు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. 'ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ఐదో రౌండ్ చర్చలు జరపడానికి మా బృందం తిరిగి అమెరికాకు వెళ్లింది. కాబట్టి ఆ ఒప్పందం ఇరు దేశాల నాయకుల నిర్ణయాల ప్రకారం జరుగుతుంది' అని అధికారులు చెప్పారు.






# కబ్జాకోరాల్లో సర్కార్ భూములు...!

## జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్ కు, ఆదిభట్ల గ్రామ ప్రజలు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... కబ్జా గురైన భూములను అధికారులచే విచారణ జరిపించి స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చారని గ్రామ ప్రజలు తెలిపారు.. ఆదిభట్ల గ్రామం ప్రజలు మాట్లాడుతూ... ఆదిభట్ల గ్రామ సమీపంలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములు సర్వే నెంబరు 31, 44, 45, 46, 47, 51, 52, 53, 67, 100, 101, 108లో గల అసైన్డ్, సీలింగ్, భూదాన్ భూములను, గతంలో ఆదిభట్ల గ్రామ సమీపంలో బడా రాజకీయ నాయకులు, స్థానికంగా ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు, విద్యాసంస్థల యజమానులతో కలిసి భూ కబ్జాలకు పాల్పడ్డారని గ్రామ ప్రజలు అన్నారు. గ్రామంలోని అసైన్డ్, సీలింగ్, భూధాన్ భూములను, గతంలో ఉన్న రెవెన్యూ అధికారుల అండదండలతో వందలాది ఎకరాలు, ఆదిభట్ల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు, ప్రభుత్వ భూములను కబ్జా చేసి అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ప్రజలు ఆరోపించారు. ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ ను కోరారు.

**ఆదిభట్ల భూములపై రియల్ ఎస్టేట్, విద్యాసంస్థల కన్ను....**

ఆదిభట్లలో అంతర్జాతీయ ఐటీ సంస్థ టిసిఎస్ ను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నెలకొల్పింది. దీంతో చుట్టుపక్కల ఉన్న భూములకు కోట్లల్లో ధరలు పెరిగాయి. దీని ఆసరాగా చేసుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు, విద్యాసంస్థల యజమానులు ప్రభుత్వ భూములపై కన్నేశారు. కబ్జాలు చేసి, తమ పేరు మీద పట్టా భూమిగా, రికార్డు మార్చుకోవడం జరిగిందని ఆదిభట్ల గ్రామ ప్రజలు ఆరోపించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఈసి శేఖర్ గౌడ్, పాండురంగారెడ్డి, పల్లె శ్రీనివాస్ గౌడ్, దర్శన్ గౌడ్, మల్లికార్జున్, రైతులు, మహిళలు తదితరులు పాల్గొని రంగారెడ్డి జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు.

# రైల్వే మ్యాన్ ఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణ పనులను పరిశీలించిన జీఎం

## కాజీపేట రైల్వే స్టేషన్ ను సందర్శించిన రైల్వే జీఎం



**హన్మకొండ మహా;** కాజీపేట్ లోని రైల్వే మ్యాన్ ఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సికింద్రాబాద్ డివిజన్‌లోని రైల్వే మ్యాన్ ఫ్యాక్చరింగ్ యూనిట్, కాజీపేట్ రైల్వే స్టేషన్ ను గురువారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సికింద్రాబాద్ డివిజన్‌లోని డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్ తో కలిసి ఇతర ఉన్నతాధికారులు ఆయన వెంట ఉన్నారు. సంజయ్ కుమార్, శ్రీవాస్తవ కాజీపేటలో నూతన రైల్వే మ్యాను ఫ్యాక్చరింగ్ యూనిట్ కోసం జరుగుతున్న నిర్మాణ పనులను సవివరంగా పరిశీలించారు. సంబంధిత అధికారులు పనుల పురోగతిపై సమగ్ర నివేదికను జనరల్ మేనేజర్ కు వివరించారు. ప్రాజెక్ట్‌ను త్వరిత గతిన పూర్తి చేసేలా పనులను మరింత వేగవంతంగా కొనసాగించాలని జనరల్ మేనేజర్ డివిజన్ అధికారులకు సూచించారు. జనరల్ మేనేజర్ నిర్మాణ స్థలంలో భద్రతా అంశాలను కూడా పరిశీలిస్తూ అన్ని భద్రతా మార్గదర్శకాలు, విధానాలు తప్పకుండా పాటించేలా సూపర్ వైజర్లు, అధికారులు నిర్ధారించుకోవాలని తెలియజేసారు. తదనంతరం హాజరైన మీడియా ప్రతినిధులతో సంభాషిస్తూ దక్షిణ మధ్య రైల్వే చేపడుతున్న అభివృద్ధి ప్రణాళికలను వారికి వివరించారు. ముందుగా, సంజయ్ కుమార్, శ్రీవాస్తవ్ సికింద్రాబాద్ నుండి కాజీపేట సెక్షన్ వరకు నిర్వహించిన రియర్ విండో తనిఖీలో ట్రాక్‌లు తో పాటు సిగ్నలింగ్ వ్యవస్థల భద్రతా అంశాలను పరిశీలించారు. ఇంకా, ఆయన యాదాద్రి & జనగాం రైల్వే స్టేషన్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా స్టేషన్లలో చేపట్టిన పునరాభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం జనరల్ మేనేజర్ కాజీపేటలోని కాకతీయ రన్నింగ్ రూమ్‌ను తనిఖీ చేసి, సిబ్బందికి అందుతున్న సౌకర్యాల గురించి లోకో పైలెట్లతో సంభాషించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆయన మొక్కను నాటారు. జనరల్ మేనేజర్ కాజీపేట రైల్వే స్టేషన్‌ను క్షుణ్ణంగా చేసిన తనిఖీలో ఆయన ప్రయాణీకుల సౌకర్యాలను సమీక్షించి సర్క్యులేటింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. కాజీపేటలోని సిబ్బంది లాబీ తో పాటు రిలే గదిని కూడా ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.

# ఎస్పి, డిఎస్పి, ఎస్ఐలపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదుకు కమిషన్ ఆదేశం

**భూపాలపల్లి, మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని గురువారం జాతీయకమిషన్ అడిషనల్ డిజిపికి ఉత్తర్వులు జారీ చేసింది. ఈవార్త భూపాలపల్లి జిల్లాలో సంచలనంగా మారింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, కాటారం పూర్వపు డీఎస్పీ జి రామ్మోహన్ రెడ్డి, కాళేశ్వరం సబ్ ఇన్స్పెక్టర్ తమాషా రెడ్డి లపై ఎస్సీ ఎస్టీ,కేసులు నమోదు చేయాలని అడిషనల్ డీజీపీకి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మహదేవపూర్ మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన చకినారపు రవిపై లేని కేసును ఉన్నట్లు కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డి పివిసి తప్పుడు రిపోర్ట్ ఇవ్వడం విచారణలో అది తప్పని తేలింది. ఈ మేరకు చకినారపు రవి ఎస్సీ ఎస్టీ జాతీయ కమిషన్కు ఫిర్యాదు చేశారు. ఎస్సై, డిఎస్పి లపై కేసు నమోదు చేయాలని జాతీయ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా ఈ కేసును సుమోటోగా విచారణ కు స్వీకరించిన ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్ భూపాలపల్లి జిల్లా ఎస్పీని సైతం బాధ్యుడిగా చేసి ముగ్గురి పైన కేసు నమోదు చేసి 15 రోజుల్లోగా నివేదిక అందజేయాలని అడిషనల్ డీజీపీని జాతీయ కమిషన్ ఇచ్చినే ఉత్తర్వు లో పేర్కొంది.

# రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట

## చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో ఇందిరమ్మ మహిళ శక్తి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళా శక్తి సంబరాల్లో ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాలే యాదయ్య, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమం చేశారు. మహిళలు బోనాలు ఎత్తుకొని, ఆటపాటలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్వయం ఉపాధి కోసం డ్వాక్రా మహిళలు నిర్వహిస్తున్న వ్యాపారాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది అన్నారు. చేవెళ్ల నియోజకవర్గం మహిళలకు స్వయం సహాయక ఉపాధి సంఘాలకు, వీఎల్ఆర్ ద్వారా నాలుగు కోట్ల 96 లక్షల రూపాయలు, బ్యాంకుల ద్వారా 41 కోట్ల 10 లక్షల రూపాయల రుణాలను మహిళా డ్వాక్రా సంఘాలకు రేవంత్ రెడ్డి సర్కార్ తోడ్పాటు అందించడం జరుగుతుంది ఎమ్మెల్యే తెలిపారు. మహిళా సంఘాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి తోడుబాటు ఎప్పటికీ ఉంటుందన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 కి గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి 200 యూనిట్ల ఉచిత విద్య విద్యుత్, మహిళలకు అనేక సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ మహిళా మణులు డ్వాక్రా సంఘాల మహిళా మణులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు....



# మహిళలకు రెండు కోట్ల చెక్కుల పంపిణీ

ఇందిరమ్మ రాజ్యంలో మహిళలు ఆర్థికంగా ఎదగాలి
ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**హన్మకొండ మహా;** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మరుసటి రోజు నుంచే పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం అంబేద్కర్ భవన్‌లో జరిగిన ప్రత్యేక చెక్కుల పంపిణి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 52 మంది లబ్ధిదారులకు 19,79,000/ విలువైన సీఎం సహాయ నిధి చెక్కులు, హనుమకొండ మండలానికి చెందిన 202 మంది లబ్ధిదారులకు 2,22,02,432/ విలువైన కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే నిజమైన ఇందిరమ్మ రాజ్యం లనే సాధ్యమవుతుందని ఆకాంక్షించారు. ఇప్పటికే ప్రజాప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ ఇల్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళలకు వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాల ద్వారా సాధికారత కోసం చాలా కార్యక్రమాలు చేపడుతున్నామని పనిచేసే వారిని గుర్తించి ప్రజలు పట్టం కట్టాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు లబ్ధిదారులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

# రైల్వే జీఎంను కలిసిన ఎమ్మెల్యే నాయిని

## కాజీపేట బస్ స్టాండ్ ఏర్పాటు స్థల ప్రక్రియ వేగవంతం చేయాలని వినతి

### కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరిన ఎమ్మెల్యే నాయిని

**హన్మకొండ మహా;** సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ గా నూతనంగా నియమితులై గురువారం కాజీపేటకు విచ్చేసిన సంజయ్ కుమార్, శ్రీవాస్తవ్ ను కాజీపేట రైల్వే స్టేషన్ లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్, విష్ణు వర్ధన్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి నూతన జీఎం కు ఎమ్మెల్యే నాయిని స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ హనుమకొండ నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కి రోడ్డు మార్గం కాజీపేట మీదుగా ఉన్నదని కాజీపేట లో బస్ స్టాండ్ లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు అని తెలిపారు.గతంలోనే రైల్వే శాఖకు కాజీపేట రైల్వే స్టేడియం లో ఉన్న స్థలాన్ని మంజూరు చేయాలని కోరడం జరిగిందని బస్ స్టాండ్ నిర్మాణం కోసం స్థల కేటాయింపు ప్రక్రియ సానుకూల దృక్పథంలో వేగవంతం చేయాలని లేక ద్వార పేర్కొన్నారు. ముఖ్యంగా కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ,ఉపాధి రంగాల్లో 50% ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గతంలో ఆగిపోయిన రైళ్లను పునః ప్రారంభించి కాజీపేటలో హాల్టింగ్ కల్పించాలని రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జంట నగరాలుగా ఉన్న ఈ ప్రాంతంలో రైల్వే డివిజన్ ఏర్పాటు ఆవశ్యకత ఉందని తెలిపారు. ఎమ్మెల్యే నాయిని కోరిన అంశాలపై జీఎం సానుకూలంగా స్పందించారు.

# దివ్యాంగులకు పెండింగ్ పెన్షన్లు మంజూరు చేయాలి




**ఆదిలాబాద్, మహా:** దివ్యాంగులకు పెండింగ్ పెన్షన్లను మంజూరు చేయడంతో పాటు కార్పొరేషన్ ను బలోపేతం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు ఎం.నగేష్ డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తమ డిమాండ్లను వెల్లడిస్తూ నిరసన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షులు నగేష్ మాట్లాడుతూ... చేయూత పెన్షన్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 24 లక్షల పైచిలుకు మంది దివ్యంగులు దరఖాస్తులు చేసుకున్నారని, పెండింగ్ పెన్షన్లు మంజూరు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వికలాంగుల కార్పొరేషన్ ను ప్రభుత్వం బలోపేతం చేసే దిశగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి జిల్లాలో టీపీసీసీ కేంద్రాలు ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేశారు. చత్తీస్ ఘడ్ వంటి రాష్ట్రాల్లో అమలు చేసిన విధంగా వికలాంగులకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించేందుకు అసెంబ్లీ లో ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. ధర్నాలో పోచన్న, అనసూయ, ప్రియాంక, హరిఫా బేగం తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో 22వ ర్యాంకు సాధించిన గ్రేటర్ వరంగల్

## తొలిసారి జీఎఫ్ సిలో స్టార్ రేటింగ్ పొందిన జీడబ్ల్యుఎంసి

## ఉత్తమ ర్యాంకులు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేసిన మేయర్



**వరంగల్ మహా;** స్వచ్ఛ సర్వేక్షన్ 2024 లో వరంగల్ మహా నగర పాలక సంస్థ జాతీయ స్థాయిలో 22 వ, రాష్ట్ర స్థాయి లో 3 10 లక్షల జనాభా కేటగిరి లో వరంగల్ మహా నగరానికి అగ్రస్థానం దక్కింది. రాష్ట్ర స్థాయిలో సమగ్రంగా 4వ స్థానం సాధించింది. ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ( ODF)+,+ సిటీ గా నగరం గత 6 సంవత్సరాలుగా గుర్తింపు పొందుతూ అదే ఒరవడిని నిరంతరం గా కొనసాగిస్తూ స్థిరమైన పారిశుద్ధ్య నిర్వహణకు నిదర్శనంగా నిలుస్తూ ఈ సారి కూడా ఘనతను గ్రేటర్ వరంగల్ దక్కించుకుంది. ఈ విజయాల వెనుక ప్రజల భాగస్వామ్యం, శాస్త్రీయ వ్యర్థ నిర్వహణ, తో పాటు పారదర్శక పాలన ఉన్నాయి. ప్రతి ఇంటి నుండి తడి,పొడి వ్యర్థాలను వేరుగా సేకరించడం, ఇంటి వద్ద కంపోస్టింగ్ తయారీ, రెండు డబ్బాల వినియోగంపై దృష్టి పెట్టి అవగాహన కల్పించడం ద్వారా ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి. సానిటేషన్ కార్మికులకు శిక్షణ, పర్యవేక్షణ వ్యవస్థలు, ఐఈసీ ప్రచారాల ద్వారా శుభ్రత ఉద్యమంగా మారింది. వరుసగా ఆరు సార్లు 2019, 2020, 2021, 2022,2023,2024 సంవత్సరాలలో ODF ++ లో చోటు దక్కడం తో వరంగల్ గ్రేటర్ కార్పొరేషన్ హ్యాట్రిక్ ను దాటి ఘనత సాధించిన అతి కొద్ది నగరాల్లో చోటు దక్కింది. మహా నగరంలో బహిరంగ రహిత మల, మూత్ర విసర్జనకు తగినన్ని పబ్లిక్ టాయిలెట్లు, ఇళ్లలో వ్యక్తిగత మరుగుదొడ్లు, ఆధునిక విధానాల ద్వారా టాయిలెట్లు నిర్వహణ, శాస్త్రీయ పద్ధతుల్లో మానవ వ్యర్థాల శుద్ధికరణ చేపట్టడం జరుగుతున్నది. మహా నగరానికి ఉత్తమ ర్యాంకు దక్కడం హర్షణీయమని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. బల్దియాకు జాతీయ స్థాయి లో 22, రాష్ట్ర స్థాయి లో 4 వ స్థానం, రాష్ట్రం లో అగ్ర స్థానం , రాష్ట్ర స్థాయి లో సమగ్రంగా 4 వ స్థానం, దక్కడానికి సహకరించిన రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అటవీ , పర్యావరణ , దేవాదాయ మంత్రి కొండా సురేఖ, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులకు, సాధించడానికి కృషి చేసిన జీ డబ్ల్యూ ఎం సి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కార్పొరేటర్లకు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు, నగరప్రజలకు ఈ సందర్భం గా మేయర్ ధన్యవాదాలు తెలిపారు.

# ప్రథమ చికిత్సలపై అవగాహన కల్పించాలి

## జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్, మహా:** ఆపత్కాల సమయాల్లో ముందుగా చేరుకొని విధులు నిర్వర్తించే పోలీసులకు ప్రథమ చికిత్సలపై పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఇందుకుగానూ బ్లూ కోర్ట్, దయల్ హండ్రెడ్ సిబ్బందికి రెండు విడతలగా ప్రథమ చికిత్స గురించి శిక్షణను అందించనుండగా... గురువారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో శిక్షణను ఎస్పీ ప్రారంభించారు. ఐదుగురు నిష్ణాతులైన వైద్యులతో ప్రథమ చికిత్సకు సంబంధించిన అంశాలపై శిక్షణ అందించనున్నారు. ఈ సందర్భంగా అఖిల్ మహాజన్ మాట్లాడుతూ... ఎలాంటి అత్యవసర సమయంలోనైనా పోలీసులు ముందుండి ఘటన స్థలాలకు చేరుకుంటారని, అక్కడ ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఆపే శక్తి సిబ్బందికి ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగానే ప్రథమ చికిత్సలపై శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సి.పీ.ఆర్ ఏ సమయంలో చేయాలి, ఎలా చేయాలి, ఎంత సమయం వరకు చేయాలి అనే అంశాలపై డాక్టర్లతో డెమో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ షాక్, పాము కాటు బాధితులకు, అగ్ని ప్రమాదంలో గాయపడిన వారికి అందించే ప్రథమ చికిత్సలపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ఈ అవకాశాన్ని పోలిసు సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పి కాజల్ సింగ్, ఏఆర్ డిఎస్పి ఇంద్ర వర్ధన్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రణయ్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ మురళి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలి

- 13 డివిజన్ లకు జీవనాధారం వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్
- అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి
- ఫిల్టర్ బెడ్ సందర్శించిన ఎమ్మెల్యేలు, మేయర్, కమిషనర్

**హన్మకొండ మహా;** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హనుమకొండ నగరం లో ప్రజల అవసరాలకు అనుగుణంగా మంచి నీరు ప్రధానమని అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి నీటి ఎద్దడి లేకుండా చూసే బాధ్యత మనందరి పై ఉందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం వర్ధన్నపేట శాసన సభ్యులు కే ఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, నగర కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అధికారులతో కలసి వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్, కాజీపేట వాటర్ ట్యాంక్ లను సందర్శించి ఫిల్టర్ బెడ్ లోపల నీటి శుద్ధి పద్ధతిని, నిల్వ సామర్థ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.

**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...**

పెరుగుతున్న జనాభా అవసరాల దృష్ట్యా ఫిల్టర్ బెడ్ మరమత్తులకు రూ.2.50 కోట్ల పై చిలుకు నిధులతో సుందరీకరణ పనులను చేస్తామని తెలిపారు. నూతనంగా 5 ఎంఎల్ డి కెపాసిటీగల ట్యాంక్ లను గోపాలపూర్, కాజీపేట,వడ్డేపల్లి లలో నిర్మించాలని కావాల్సిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి సరఫరాలో అధికారులకు క్షేత్ర స్థాయి సిబ్బందికి సమన్వయ లోపం వలన ప్రజలకు నీటి సమస్య కలుగుతుందని తెలిపారు. ఫిల్టర్ బెడ్ బయట లోపల నిఘానేత్రాలు ఉండేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

# సామాజిక తనిఖీలో బయటపడ్డ అధికారుల పనితీరు...




**తలమడుగు మహా న్యూస్,** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీల పథకం 16 వ విడత సామాజిక తనిఖీ ప్రకావేదిక ను గురువారం రోజు తలమడుగు మండల కేంద్రంలో నిర్వహించరు. మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పథకంలో పని చేసినటువంటి సభ్యుల వివరాలను అర్థవంతంగా తనిఖీ సభ్యులు రాతపూర్వకంగా రాసుకొని వారి వారి గ్రామపంచాయతీలలో గ్రామసభ నిర్వహించి అనంతరం గురువారం ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో జిల్లా అధికార యంత్రాంగం ముందు ప్రవేశపెట్టడం జరిగింది. ఈ తనిఖీలలో చాలా గ్రామాలలో మొక్కలు పెట్టినటువంటివి వాడిపోయి పనికి రాకుండా కింద పడిపోయి 25 నుంచి 30% వరకే మొక్కలు బ్రతికి ఉండడం అధికారుల సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వలెనని తనిఖీ సిబ్బంది వివరించడం జరిగింది. గ్రామపంచాయతీ కార్యదర్శులు రిజిస్టర్లలో రికార్డ్స్ సరిగ్గా రాయనందున కొంతమంది అసలే రికార్డ్ రాయని వారిని అధికారులు మందలించడం జరిగింది. ఓ అధికారికి గతంలో కూడా ఈ సామాజిక తనిఖీ నేపథ్యంలో 1000 రూపాయలు జరిమాన వేయడం జరిగింది మళ్లీ అదే తప్పు చేయడం వల్ల 5000 జరిమానా వేస్తామని అధికారులు తనిఖీలు హెచ్చరించారు. కొంతమంది పనులకు పోకుండా వారి వారి అకౌంట్లో డబ్బులు పడ్డాయని ఆయాలకు ఆశలకు కూడా పని కల్పించినట్టు వారి రికార్డుల్లో ఉందని తనిఖీ సిబ్బంది చెప్పడం జరిగింది. చాలా గ్రామపంచాయతీలలో పని చేసినటువంటివి నేమ్ బోర్డ్స్ పెట్టించలేదని అవి త్వరగా పెట్టించాలని జిల్లా అధికారులు మండల పై మండిపడి వెంటనే నేమ్ బోర్డ్స్ పెట్టించారని పనిచేసినటువంటి పనిని చూపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడి రవీందర్ రాథోడ్, శిక్షణ కలెక్టర్ సలోని, అడిషనల్ పిడి కుటుంబరావు, ఏపీడి కృష్ణారావు, ఎంపీడీవోలు చంద్రశేఖర్, శంకర్ , తనిఖీ సిబ్బంది అధికారి రాజేశ్వర్, ఏపిఎం సెక్రటరీలు టిఏ లు ఫీల్డ్ అసిస్టెంట్స్ తనకి సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణే షీ టీం ప్రధాన లక్ష్యం

## భద్రత పై మహిళలకు భరోసా కల్పించేందుకు షీ టీం ఏర్పాటు

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లాలోని నర్సంపేట డివిజన్ పరిధిలోని మహిళలు, విద్యార్థునులకు భద్రతపై భరోసా కల్పించడంలో భాగంగా నర్సంపేటలో ఏర్పాటు చేయడం జరిగిందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. నర్సంపేట డివిజన్ పరిధిలో మహిళల భద్రత కోసం నర్సంపేట పట్టణ కేంద్రంలో పోలీస్ సిబ్బంది నివాస సముదాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన షీ టీం కార్యాలయాన్ని వరంగల్ లాంఛనంగా ప్రారంభించారు. నర్సంపేట షీ టీం విభాగం తొలి ఎస్.ఐగా నియమించబడిన స్వాతిని పోలీస్ కమిషనర్ మొక్కను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నర్సంపేట నూతనంగా ఏర్పాటు చేసిన షీ టీం విభాగం నిర్వహించాల్సిన విధుల పై షీ టీం ఏసిపి సదయ్య పోలీస్ కమిషనర్ కు వివరించగా, మహిళా కాలేజీ, పాఠశాల విద్యార్థునుల భద్రత కోసం షీ టీం తరుపున కాలేజీ విద్యార్థునులు అకతాయిల నుండి తమకు తాము రక్షించుకొనేందుగాను షీ టీం ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫేన్స్‌లో భాగంగా విద్యార్థునులకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ అందించాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న నర్సంపేట పట్టణంలో పదుల సంఖ్యల ఉన్నత విద్యకు సంబంధించిన కళాశాలతో పాటు, చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి మహిళలు పెద్ద సంఖ్యలో వివిధ అవసరాల కొసం నర్సంపేట నగరానికి వచ్చిపోయే మహిళలతో పాటు స్థానిక మహిళలు, విద్యార్థునులకు భద్రత కల్పించడం కోసమే నర్సంపేటలో షీ టీం విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రస్తుతం మూడు షీ టీంలు పనిచేస్తున్నాయని ఎవరైన ఆకతాయిలు మహిళలను వేధించిన లైంగిక వేధింపులు గురిచేసిన తక్షణమే నర్సంపేట టీం విభాగం ఫోన్ నంబర్ 8712552326 సమాచారం అందించాలని కోరారు. నర్సంపేటలో ఏర్పాటు చేసినట్లే రాబోవు రోజుల్లో జనగామ జిల్లా కేంద్రంలోను షీ టీంను ఏర్పాటు చేయడం జరుగుతుందని అదే విధంగా అవకాశాన్ని బట్టి వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మరిన్ని షీ టీం బృందాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డిసిపి అంకిత్ కుమార్, నర్సంపేట,షీటీం ఏసిపిలు రవీందర్ రెడ్డి, సదయ్య, వరంగల్ పోలీస్ కమిషనరేట్ షీ టీం ఇన్స్‌స్పెక్టర్ సుజాత, నర్సంపేట ఇన్స్‌స్పెక్టర్ రఘు, దుగ్గొండి సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ సాయిరమణ, నర్సంపేట డివిజన్ ఎస్.ఐలు ఇతర పోలీస్‌సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**నర్సంపేట, ఖానాపూర్, దుగ్గొండి పోలీస్ స్టేషన్ల ను సందర్శించిన సిపి**

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం నర్సంపేట డివిజన్ పరిధిలోని నర్సంపేట,దుగ్గొండి, ఖానాపూర్ పోలీస్ స్టేషన్లతో పాటు, నర్సంపేట ఏసిపి, దుగ్గొండి సర్కిల్ పోలీస్ కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ అధికారులు పోలీస్ కమిషనర్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ పరిసరాలను పరిశీలిమచడంతో పాటు, స్టేషన్ పనీతీరూ, స్టేషన్ పరిధిలో అధికంగా నమోదయ్యే కేసల వివరాలతో పాటు, గ్రామాల వివరాలను పోలీస్ కమిషనర్ సంబంధిత స్టేషన్ అధికారిని అడిగి తెలుసుకున్నారు.

## రైతులందరూ తప్పనిసరిగా
# ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
### జిల్లా వ్యవసాయ అధికారి డి. ఉష
### వెలిజర్లలో రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన



**షాద్ నగర్, మహా:** భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి డి. ఉష సూచించారు. గురువారం ఆమె వెలిజర్ల రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా భూమి ఉన్న రైతులందరూ తమ ఆధార్ కార్డు మొబైల్ ఫోన్‌తో సంబంధిత వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె రైతులకు సూచించారు. ఈ రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వ పథకాలు రైతులకు వర్తిస్తాయని ఆమె స్పష్టం చేశారు.

**నాణ్యమైన వరి విత్తనాల క్షేత్రస్థాయి పరిశీలన**

రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి మండలంలోని ప్రతి రెవెన్యూ గ్రామానికి ముగ్గురు రైతులకు మూడు చొప్పున మొత్తం 108 వరి నాణ్యమైన విత్తన (ఫౌండేషన్ సీడ్) మినీ కిట్‌లను అందించారు. ఇందులో భాగంగా కొండన్నగూడ గ్రామంలో వెంకటరెడ్డి పొలంలో సాగు చేసిన కె ఎన్ ఎం 1638 రకం వరి పంటను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ నాణ్యమైన విత్తనం ద్వారా రైతులు స్వయంగా విత్తనాలను తయారుచేసుకొని, తోటి రైతులకు విక్రయించడమే కాకుండా, కల్తీ విత్తనాలను అరికట్టవచ్చని అధికారులు రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఏ.డి.ఏ రమాదేవి, ఏవో టెక్నికల్ శోభారాణి, మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు గోవర్ధన్, తేజ్ కుమార్ పాల్గొన్నారు.

# సెల్ఫీ ఫోటోలు... సహ పంక్తి భోజనం
### కుశల ప్రశ్నలు.. విద్యార్థినిలతో స్నేహపూర్వక భేటీ.. కేజీబీవీ విద్యార్థులతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి, మహా:** విద్యార్థులు ఎలా ఉన్నారు బాగా చదువుకుంటున్నారా టీచర్లు పాటలు ఎలా చెప్తున్నారు? ఏం సమస్యలు ఉన్నాయంటూ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ విద్యార్థులతో స్నేహ పూర్వక భేటీ చేశారు. గురువారం భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని (కేజీబీవీ) జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. 10 వ తరగతి విద్యార్థుల సామర్ధ్యాలను కలెక్టర్ పరిక్షించేందుకు విద్యార్థులతో హిందీ పాఠం చదివించారు. చదవడంలో విద్యార్థులు చూపించిన ప్రతిభ పట్ల కలెక్టర్ అభినందించారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడి, అభిప్రాయాలను, సౌకర్యాలు, సమస్యల గురించి కలెక్టర్ రాహుల్ శర్మ అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కలెక్టర్ తో సంతోషంగా గడపడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువులో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు స్పెషల్ క్లాసులు నిర్వహించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలోను రాణించి నెంబర్ వన్ స్థాయికి చేరాలని విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉండాలని, తల్లిదండ్రులు నుండి దూరం వచ్చి చదువుకుంటున్నారని, విద్యార్థులను మన పిల్లలుగా భావించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతూ, విద్యా ప్రగతికి బాటలు వేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. స్టోర్ రూము, వంటగదిని పరిశీలించి వంట గది నిర్వహణను స్వయంగా ఫోటో తీసుకున్నారు. పాఠశాల నిర్వహణను పరిశీలించిన కలెక్టర్ భోజనం నాణ్యత, పరిశుభ్రత, నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్భోజనం బావుంది... స్టోర్



రూమ్ నిర్వహణ బావుంది.. ఇలానే మంచిగా నిర్వహించండని సిబ్బందిని అభినందించారు. విద్యార్థులకు వసతి, భోజనంతో విద్యాభ్యాసానికి మంచి వాతావరణం కల్పించడంలో ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు.పాఠశాలల్లో మురుగునీరు వెళ్లేందుకు అవుట్ లెట్, కాంపౌండ్ వాల్, సోలార్ విద్యుత్తు సౌకర్యం కల్పించాలని ప్రిన్సిపాల్ కోరగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఈఓ రాజేందర్, ఎంపీడీవో జయశ్రీ, ప్రిన్సిపల్ సుమలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం పెద్దపీట



**ఆమనగల్లు, మహా :** అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు రాష్ట్రంలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు అన్నారు. పేదల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాయన్ పల్లి తండా గురువారం కేశవులు పర్యటించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పనులను పరిశీలించారు. మొదట గా బేస్మెంట్ పూర్తి చేసుకున్న ఇందిరమ్మ లబ్ధిదారుల ఖాతాలో ప్రభుత్వం రూ. లక్ష రూపాయలు జమ చేయడం జరుగుతుందని. కల్వకుర్తి నియోజకవర్గం లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో 3500 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు జరుగుతున్నట్లు కేశవులు తెలిపారు. నియోజకవర్గానికి అదనంగా మరో 1000 ఇందిరమ్మ ఇండ్లు త్వరలో మంజూరు కానున్నట్లు తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి ఉచిత బస్సు, ఉచిత విద్యుత్తు, సన్న బియ్యం పంపిణీ, విద్యార్థులకు నాణ్యమైన భోజనం పథకాల పై ప్రచారం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ముందుకు సాగాలని, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను గడపగడపకు తీసుకువెళ్లి ప్రజలకు వివరించాలని కేశవులు కోరారు. కార్యక్రమంలో నాయకులు రాగ్య నాయక్, శ్రీను నాయక్, గోపాల్ నాయక్, శంకర్ నాయక్, హర్యా నాయక్, సాగర్, రమేష్, దుద్దు కృష్ణ, బన్సీలాల్, జైపాల్, గోబ్రియా తదితరులు పాల్గొన్నారు

### ఆమనగల్లు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎచ్ఈఓ
## తిరుపతిరెడ్డికి ఉత్తమ సేవల పురస్కారం



**ఆమనగల్లు, మహా:** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమనగల్లు*ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం హెచ్ఈఓ తిరుపతి రెడ్డి కి ఉత్తమ సేవా పురస్కారాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ మేరకు హైద్రాబాద్ కామినేని మెడికల్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో హెచ్ఈఓతిరుపతిరెడ్డి గారికి డిఎంఅండ్ హెచ్ ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డిఎంహెచ్ డాక్టర్ గీత సత్కరించి ప్రశంసాపత్రం, మెమెంటో అందజేసి అభినందించారు. కార్యక్రమంలో. జిల్లా ఏవో షఫీ ,జిల్లా డెమో అధికారి శ్రీనివాస్,ప్రోగ్రాం అధికారి అక్రమ్,పూనమ్,తదితరులు పాల్గొన్నారు.

## డైరీఫార్మ్ చౌరస్తాలో రోడ్డుకు అడ్డంగా టమాట ట్రక్కు బోల్తా
### రోడ్డుకు అడ్డంగా పడడంతో ట్రాఫిక్ జామ్





**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ నుంచి టమాటా లోడుతో డీసీఎం వాహనం వేగంగా వస్తూ డైరీ ఫార్మ్ చౌరస్తా వద్ద పీవీ నరసింహారావు ఎక్స్ప్రెస్ వే కింది భాగంలోని పిల్లర్ ని ఢీకొని బోల్తా పడిన ఘటన, రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు రైతుల కొందరు టమాటా లోడ్ తో శంషాబాద్ నుంచి గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ కి డీసీఎం వాహనంలో బయలుదేరారు.డైరీ ఫార్మ్ చౌరస్తా వద్ద అతివేగంగా వస్తు డీసీఎం పిల్లర్ని ఢీకొని వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో టమాటా బాక్సులు రోడ్డు కు అడ్డంగా చెల్లాచెదురుగా పడ్డాయి. చెల్లాచెదురుగా పెట్టెలు పడడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడం అదృష్టం. జిహెచ్ఎంసి కార్మికులు టమాటల్ని ఒకచోట చేర్చారు. పోలీసులకు సమాచారం అందించడంతో ట్రాఫిక్ పోలీసులు రావడంతో ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కొత్త బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన
### హాజరైన ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, వీర్లపల్లి శంకర్





**షాద్ నగర్, మహా:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పిల్లోనిగూడ గ్రామంలో సీ.ఆర్.ఆర్. నిధుల ద్వారా మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కొత్త రోడ్లు పిల్లోనిగూడ నుండి తిమ్మాపూర్ రైల్వే గేట్ వరకు మరియు నానాజీపూర్ వరకు నిర్మించబడతాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు శంకర్, ప్రకాష్ గౌడ్ లు మాట్లాడుతూ.. ఈ రోడ్ల నిర్మాణం వలన గ్రామస్తులకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని, ప్రయాణ సమయం తగ్గుతుందని తెలిపారు. అభివృద్ధి పనులకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిధులు సద్వినియోగం అవుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నేతలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## వానరానికి అంత్యక్రియలు
### ఉదారతను చాటుకున్న యువకుడు

**వరంగల్ మహా;** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వానరానికి అంత్యక్రియలు నిర్వహించి ఓ యువకుడు తన ఉదారతను చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే వరంగల్ నగరంలోని శంభునిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల కు వెళ్లే దారిలో గురువారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ వానరం మృతి చెందింది. అదే సమయానికి అటుగా వెళ్తున్న శంభునిపేట ప్రాంతానికి చెందిన జడల రాము మృతి చెందిన వానరాన్ని చూసి చలించి పోయాడు. వెంటనే వానరానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు అదే ప్రాంతానికి కొండయ్య, సంజీవ్ ల సహాయంతో మంగళమ్మ కుంట చెరువు ప్రాంతంలో గొయ్యి తీసి వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా మృతి చెందిన వానరానికి అంత్యక్రియలు చేసిన రాము ను పలువురు అభినందించారు.



### బాలాపూర్ బోనాల ఉత్సవాలలో
## పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి

**బాలాపూర్ మహా:** బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని బాలాపూర్ గ్రామం లో జరిగిన ఆషాడమాసం అమ్మవారి బోనాల ఉత్సవాల లో మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజల పై అమ్మవారు ఆశీస్సులు ఉండాలని, వర్షాలు సమృద్ధి కురువాలని ప్రార్థించినట్టు సబితా రెడ్డి తెలిపారు. తెలంగాణ సంప్రదాయమైన బోనాల పండుగను ప్రజలందరూ సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. బోనాలను ఘనంగా నిర్వహించుకోవడానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం నుంచి దేవాలయా లకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బాలాపూర్ సీనియర్ నాయకులు ఒంగేటి లక్ష్మారెడ్డి,కళ్లెం ఎల్లారెడ్డి,గుండోజి రఘునందన్ చారి,అత్తాపురం శ్రీనివాస్ రెడ్డి,జూకంటి సురేష్ గౌడ్, తిమ్మిని గిరేష్,వంగేటి అశ్విన్ రెడ్డి, అరవింద్ గౌడ్, హరి గౌడ్,మోర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ పెంచకపోతే ప్రభుత్వంతో యుద్ధమే చేస్తాం
### ఈ నెల 21న పెన్షన్ దారుల జిల్లా సదస్సును విజయవంతం చేయాలి
### ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ



**ఆమనగల్లు, మహా:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగుల పెన్షన్ లు రూ 6000 కు అన్ని రకాల చేయూత పెన్షన్లు రూ.4000 పెంచి అర్హులైన ప్రతిఒక్కరికి అందజేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు.గురువారం అమనగల్లు మండల కేంద్రంలో విఎచ్పిఎస్ ఎంఆర్పిఎస్, అనుబంధ సంఘాల సమావేశం ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు కావాలి శ్రీశైలం మాదిగ అధ్యక్షతన నిర్వహించారు..ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాగల్ల ఉపేందర్ మాదిగ హాజరై మాట్లాడారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా పెన్షన్ దారులకు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా, కొత్త పెన్షన్లు మంజూరు చేయకుండా నెలకు వెయ్యి కోట్ల చొప్పున 18 వేల కోట్ల రూపాయల బడ్జెట్ ను పక్కదారి పట్టిస్తున్నారని, పెన్షన్ డబ్బులను ఎగగొట్టడం రేవంత్ రెడ్డి సర్కార్ కు తగదని మండిపడ్డారు. నిస్సహాయ స్థితిలో ఉండి కేవలం పెన్షన్ మీదనే ఆధారపడి జీవిస్తున్న వికలాంగుల, ఆసరా పెన్షన్ దార్లను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారికి అన్యాయం చేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన రోజు నుండి వికలాంగులకు రూ 6000 అలాగే మిగితా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత,గీత బీడీ కార్మికుల పెన్షన్ 4000 పెన్షన్ పెంచుతామని, కండరాల క్షీణత తీవ్రస్థాయి వైకల్యం ఉన్నా వారికి నెలకు 15 వేల రూపాయలు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి, నేటికి దానిని నిలబెట్టుకోలేదన్నారు. పెన్షన్ దారుల పొట్టగొడుతూ ప్రభుత్వం దగా చేస్తుంటే, ప్రతిపక్ష పార్టీలు, రాజకీయ పార్టీలు మౌనం వహించడం దారుణమన్నారు. పెన్షన్ దారుల బాధలు, ప్రభుత్వానికి కనబడడం లేదని,కనీసం ప్రతిపక్షాలు, పార్టీలకు కూడా కనబడవా అని ప్రశ్నించారు. వికలాంగుల ఆసరా పెన్షన్ దారుల బాధల్ని పట్టించుకోని ప్రభుత్వానికి మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పోరాటాల ద్వారానే గుణపాఠం చెప్తమని, ఆగస్టు 13 లోపు పెన్షన్ పెంచకపోతే హైదరాబాదులో వికలాంగులు ఆసరా పెన్షన్ దారులతో యుద్ధమే కొనసాగుతుందని హెచ్చరించారు.పెన్షన్ దారుల పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న అమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్ లో చేయూత పెన్షన్ దారుల ఆవేదన జిల్లా సన్నాహక సదస్సును నిర్వహిస్తున్నామని, ప్రతి గ్రామం నుండి పెన్షన్ దారులు వేలాదిగా కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈజిల్లా సదస్సులో ముఖ్య అతిథిగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పాల్గొంటారని ప్రతి గ్రామం నుంచి వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత బీడీ కార్మికులు చేయూత పెన్షన్ దారులు అధిక సంఖ్యలో తరలి వచ్చి జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ల నరసింహ, జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ, విఎచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు యాచారం జంగయ్య మాదిగ,యంఆర్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తుడుం కిరణ్ , ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు దరువుల రామచంద్రం మాదిగ,విఎచ్పిఎస్ జిల్లా నాయకులు వరికుప్పల వెంకటేష్ , ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మల్లెపోగు మల్లేష్, ఎమ్మార్పీఎస్ ఆమనగల్లు మండల ఉపాధ్యక్షులు శ్రీరాములు , మంద రాకేష్,తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు
### అధికారులను మందలించిన కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి



**రాజేంద్రనగర్ మహా ;** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్ లో నూతనంగా నిర్మించనున్న సీ సీ రోడ్డు పనులను రాజేంద్ర నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ శ్రీ తోకల శ్రీనివాస్ రెడ్డి జిహెచ్ఎంసి, జి ఎం డబ్ల్యూ ఎస్ ,ఎస్బి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు సీసీ రోడ్డు పనులకు నూతన ఎస్టిమేషన్ వేసి త్వరగా పనులను ప్రారంభించే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. సాయిబాబా నగర్ లో భూగర్భ డ్రైనేజీ పైప్లైన్ వ్యవస్థను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. బోనాల పండుగ సందర్భంగా అమ్మవారి దేవాలయం పరిసర ప్రాంతాలలో మరమత్తుల పనులు త్వరగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు సమస్యలు తలెత్తితే సహించేది లేదన్నారు. డివిజన్ పరిధిలో ఏమైనా సమస్యలు ఉంటే బస్తీవాసులు నా దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యలను పరిష్కరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు ఏఈ నరసింహ మూర్తి, వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్, సూపర్ వైజర్ లోక్ నాథ్, శశిధర్ రెడ్డి, సంతుగౌడ్, భూషణ్, నర్సింగ్ ముదిరాజ్, లోకేష్, దత్తు భాయ్, బాబూలాల్, మన్మోహన్ రెడ్డి, అశోక్, దేవేందర్ యాదవ్, రమేష్, అనిల్, చంపకలాల్, అనిల్, లోకేష్, బబ్లూ, శంకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలలో ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు రద్దు చేయాలి
### షాద్ నగర్ అసెంబ్లీ బిజెపి ఇంచార్జ్ అందె బాబయ్య



**షాద్ నగర్, మహా:** ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల డిప్యూటేషన్ల వల్ల విద్యార్థుల చదువు దెబ్బ తింటుందని వెంటనే డిప్యూటేషన్లను రద్దు చేయాలని భారతీయ జనతా పార్టీ షాద్ నగర్ అసెంబ్లీ ఇంచార్జ్ అందె బాబయ్య డిమాండ్ చేశారు. షాద్ నగర్ పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్ లో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం జరిగింది. ఈ మీడియా సమావేశానికి బిజెపి స్థానిక నాయకులు దేపల్లి అశోక్ గౌడ్, కక్కునూరి వెంకటేష్ గుప్తా, చెంది మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందె బాబయ్య మాట్లాడుతూ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు తక్కువ సంఖ్యలో జాయిన్ అవుతున్నారని అక్కడ ఉండేట ఉపాధ్యాయులను డిప్టేషన్ పై పంపించే ప్రక్రియను వెంటనే ఉపరిసంహరించుకోవాలని పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచే కార్యక్రమం చేపట్టాలని ఈ విధంగా విద్యార్థులు తక్కువయ్యారని పాఠశాలలో బోధించే ఉపాధ్యాయులను పంపిస్తే ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగవుతాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదివారని ప్రభుత్వ చర్యలు తీసుకొని పాఠశాలలో బోధనలు సౌకర్యాలు పెంచి కార్పొరేట్ స్థాయిలో విద్యను బోధించాలని అప్పుడే ప్రభుత్వ పాఠశాలలో మనం కూడా సాధ్యమవుతుందని ఉపాధ్యాయులను డిప్రెషన్ చర్యలు వెంటనే ఉపసంహరించుకోవాలని అందె బాబయ్య డిమాండ్ చేసినారు. దేపల్లి అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో డిప్టేషన్ ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కక్కునూరి వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జిల్లా పరిషత్తు పాఠశాలలో డిప్టేషన్ పై ఉపాధ్యాయులను పంపే ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలని పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు చేయాలని విద్యార్థులను పెంపొందించే చర్యలు చేపట్టాలని డిప్టేషన్ ప్రక్రియ వెంటనే ఆపేయాలని డిమాండ్ చేశారు చెంది మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో బోధించే ఉపాధ్యాయులు మంచి శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని మంచి విద్యబోధన చేస్తారని ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థులు పెంచడానికి కృషి చేయాలని డిప్టేషన్ ప్రక్రియ వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు హరి భూషణ్ పటేల్ ప్రధాన కార్యదర్శి నరసింహులు కేశంపేట ప్రధాన కార్యదర్శి పద్మ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు..



### చేపల వేటకు వెళ్లి..
## ఒకరు మృతి

**ఆమనగల్లు, మహా:** చేపల వేటకు వెళ్లిన స్నేహితులలో ఒకరు నీట మునిగి మృతి చెందారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఉట్లపల్లి గ్రామానికి చెందిన దొంతుల అంజయ్య కడ్తాల్ సమీపంలోని చెరువులో చేపల వేటకు వెళ్లారు. ఈ క్రమంలో అంజయ్య నీటిలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్నపోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం కోసం గజ ఈత గాళ్ళతో గాలింపు చర్యలు చేపట్టగా బాడీని గుర్తించి వెలికితీశారు.మృతునికి భార్య,ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య షామంత, అల్లుడు కుమార్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ గంగాధర్ తెలిపారు.

### పిఆర్ఓ పాషాకు తెలంగాణ రాష్ట్ర
## సీఎం రేవంత్ రెడ్డి మేన కోడళ్ళు పరామర్శ



**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు లయన్స్ క్లబ్ పీఆర్వో, విద్యానగర్ కాలనీసంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంఏ పాషాను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి మేన కోడళ్ళు గోలి పద్మ, యెన్నం సంధ్య పరామర్శించారు. పాషా సతీ మణి షాహిన్ ఇటీవల మృతిచెందింది. ఆమనగల్లు పట్టణంలోని ఆయన నివాసంలో గురువారం పాషాతో పాటు ఆయన కూతుళ్లు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. షాహిన్ మృతిపట్ల సంతాపం తెలిపి మనోధైర్యంతో ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ముక్రం ఖాన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.



### గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వంలోనే
## చెక్కుల పంపిణీ అధికం

**బాలాపూర్ మహా:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం గతం లో కంటే ఎక్కువ దేవాలయాలకు చెక్కులు పంపిణీ చేస్తుందని ప్రభుత్వ సలహాదారుడు వేణుగోపాల్ రావు తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గానికి సంబంధించి 17 లక్షల విలువ చేసే 47 చెక్కులను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ప్రభుత్వ విప్ వేణుగోపాల్,TUFIDC చైర్మన్ చల్ల నరసింహారెడ్డి జిల్లెలగూడ వెంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణం లో కలిసి లబ్ధిదారుకు చెక్కులు పంపిణీ చేశారు. ప్రజా ప్రభుత్వం లో ప్రత్యేకమైన విజన్ తో అభివృద్ధి లో తెలంగాణ ను ముందుకు తీసుకెళ్తున్నామని వేణుగోపాల రావు తెలిపారు. అభివృద్ధిని కి అడ్డుపడకుండా సహకరించాలని ప్రతిపక్ష పార్టీలకు సూచించారు వేణుగోపాల రావు. మహేశ్వరం నియోజకవర్గం తో పాటు రంగారెడ్డి జిల్లా వ్యాప్తం గా కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని ఐకమత్యంతో పార్టీ నాయకులు పని చేస్తున్నారని,స్థానిక సంస్థ ల ఎన్నికల లో అత్యధిక మెజార్టీ లో కాంగ్రెస్ పార్టీ గెలిపే లక్ష్యం గా పని చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గం లో ప్రతి ఇంటి కి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను చేరవేసేందుకు నాయకులు,కార్యకర్తలు కష్టపడుతున్నారని తెలిపారు. రంగారెడ్డి జిల్లాను అభివృద్ధి లో ముందుకు తీసుకెళుతున్న ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ,బీఆర్ఎస్ పార్టీ నాయకులు,దేవాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఎస్‌బీఐకి డబ్బు అవసరం.. నిధుల సమీకరణ షురూ

## క్విప్ ద్వారా రూ.25,000 కోట్లు.. బాండ్ల జారీతో రూ.20,000 కోట్లు

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ నిధుల సమీకరణకు తెరతీసింది. షేరుకి రూ.811.05 ఫ్లోర్ ధరలో అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్)ని చేపట్టింది. తద్వారా రూ.25,000 కోట్లు సమీకరించాలని ఆశిస్తోంది. అయితే ఫ్లోర్ ధరకంటే 5 శాతం డిస్కౌంట్‌లో క్విప్‌ను పూర్తి చేసే వీలున్నట్లు తెలియజేసింది. షేరు తాజా ధర రూ. 831.55తో పోలిస్తే ఫ్లోర్ ధర సైతం 2.5 శాతం తక్కువకావడం గమనార్హం! వీటికితోడు రుణ సెక్యూరిటీల(బాండ్లు) జారీ ద్వారా మరో రూ. 20,000 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉన్నట్లు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరం(2025-26)లో దేశీ ఇన్వెస్టర్లకు బాండ్లను ఆఫర్ చేయనున్నట్లు తెలియజేసింది. వెరసి రూ.45,000 కోట్ల సమీకరణకు ప్రణాళికలు వేసింది. ఈ ఏడాది మే నెలలో ప్రయివేట్ ప్లేస్‌మెంట్ ద్వారా రూ.25,000 కోట్ల సమీకరణకు ఎస్‌బీఐ బోర్డ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. జూన్‌లో బ్యాంక్ వాటాదారులు సైతం ఇందుకు ఆమోదముద్ర వేశారు. కాగా.. ఎస్‌బీఐ ఇంతక్రితం 2017-18లో క్విప్ ద్వారా రూ. 15,000 కోట్లు సమకూర్చుకున్న విషయం విదితమే! భవిష్యత్తులో రుణ వృద్ధికి, మూలధన వ్యయానికి ఈ నిధులు ఉపయోగపడనున్నాయని అధికారులు తెలిపారు.

**రిలయన్స్ సంస్థలు సైతం**

రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బోర్డు వివిధ మార్గాలలో రూ.9,000 కోట్లు సమీకరించేందుకు తాజాగా అనుమతించింది. దీనిలో భాగంగా ఈక్విటీ షేర్లు లేదా ఈక్విటీ సంబంధ క్విప్ లేదా క్విబ్ తదితరాల ద్వారా రూ.6,000 కోట్లు సమకూర్చుకోనుంది. అంతేకాకుండా ఒకేసారి లేదా దశలవారీగా మార్పిడిరహిత డిబెంచర్ల(ఎన్‌సీడీలు) జారీ ద్వారా మరో రూ.3,000 కోట్లు సమీకరించనుంది. ఇందుకు ప్రయివేట్ ప్లేస్‌మెంట్ లేదా ఇతర విధానాలను ఎంచుకోనుంది. రిలయన్స్ పవర్ బోర్డు వివిధ మార్గాలలో రూ. 9,000 కోట్లు సమీకరించేందుకు తాజాగా అనుమతించింది. దీనిలో భాగంగా ఈక్విటీ షేర్లు లేదా ఈక్విటీ సంబంధ క్విప్ లేదా క్విబ్ తదితరాల ద్వారా రూ. 6,000 కోట్లు సమకూర్చుకోనుంది. అంతేకాకుండా ఒకేసారి లేదా దశలవారీగా మార్పిడిరహిత డిబెంచర్ల(ఎన్‌సీడీలు) జారీ ద్వారా మరో రూ.3,000 కోట్లు సమీకరించనుంది. ఇందుకు ప్రయివేట్ ప్లేస్‌మెంట్ లేదా ఇతర విధానాలను ఎంచుకోనుంది.

# ఎరువుల కోసం రైతన్న పడిగాపులు

వ్యవసాయం దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా నిలుస్తోంది. దేశంలో అధిక జనాభా జీవనోపాధి వ్యవసాయంపైనే ఆధారపడి ఉంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, క్రిమిసంహారకాల వాడకం పెరుగుతుండడం వల్ల సాగుభూమి క్రమంగా సారం కోల్పోతుందని చాలా నివేదికలు చెబుతున్నాయి. పంటల దిగుబడి పెంచాలంటే సహజ ఎరువులు వాడాలని అధికారాలు ఎంత ఊదరగొడుతున్నా అందుకు సరిపడా బడ్జెట్ కేటాయించకపోవడంతో ఆ లక్ష్యం నీరుగారుతోంది. రైతులు ఏ పంట వేసినా దాదాపు యూరియా వాడకం తప్పనిసరైంది. కానీ సాగుకు సరిపడా యూరియా తయారీలో యాంత్రాంగాలు జాప్యం చేస్తున్నాయనే వాదనలున్నాయి. అందుకు కొన్ని కారణాలను కింద తెలియజేశాం. యూరియా పంట దిగుబడి పెంచడంలో, ఆహార భద్రతను నిర్ధారించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. అంతటి ప్రాముఖ్యత ఉన్నప్పటికీ ప్రభుత్వాలు తరచు దీని తయారీ ప్లాంట్లను స్థాపించడంలో లేదా ఇప్పటికే ఉన్న వాటిలో ఉత్పాదకతను విస్తరించడంలో గణనీయమైన జాప్యాన్ని ఎదుర్కొంటున్నాయి. దాంతో రైతులకు పంట సమయానికి ఎరువుల దుకాణాల ముందు పడిగాపులు తప్పడంలేదు. ఈ ఏడాది ఎంత మొత్తంలో ఎరువులు అవసరం అవుతాయో ముందే నిర్ధారించుకున్న ప్రణాళిక ప్రకారం ప్రభుత్వం ఎరువులు తయారు చేయాల్సి ఉంటుంది. లేదా దిగుమతి చేసుకోవాలి. ఇప్పటికే ప్రభుత్వ గోదాముల్లో ఎరువులు నిల్వ ఉంచి అవసరాలకు తగ్గట్టుగా వెంటనే సరఫరా చేసే వ్యవస్థగా ఏర్పాటు చేయాలి. కానీ ప్రస్తుత పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఎరువుల తయారీలో, వాటి సరఫరాలో జాప్యానికి చాలానే కారణాలున్నాయి.



**ఆర్థిక పరిమితులు**

యూరియా తయారీ అనేది మూలధన ఆధారిత ప్రక్రియ. కొత్తగా ఎరువుల కర్మాగారాన్ని నిర్మించడానికి వేలాది కోట్ల రూపాయలు ఖర్చవుతాయి. దాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులో తీసుకురావడానికి చాలా ఏళ్లు పట్టవచ్చు. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రభుత్వాలు ఇప్పటికే పరిమిత ఆర్థిక వసతులతో పోరాడుతున్నాయి. ఫలితంగా ఇటువంటి దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నిధులు కేటాయించడం కష్టమవుతుంది. అడపాదడపా బడ్జెట్‌లో వ్యవసాయానికి కేటాయించిన మొత్తం నుంచి ఇలాంటి ప్రాజెక్ట్‌లకు నిధులు వెచ్చించడంలేదు. నిర్మాణ వ్యయంతోపాటు యూరియా తయారీకి భారీగా సబ్సిడీ ఇస్తున్నారు. భారత్ వంటి దేశాల్లో రైతులు యూరియాను దాని వాస్తవ ఉత్పత్తి వ్యయంలో కొంత ధరలకే కొనుగోలు చేస్తున్నారు. ఈ వ్యత్యాసాన్ని ప్రభుత్వం రాయితీలతో పూడుస్తోంది. దేశీయంగా ఉత్పాదకతను పెంచితే అందుకు అనుగుణంగా ప్రైవేట్ కంపెనీలకు అధిక సబ్సిడీ బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఇది ప్రభుత్వాలకు భారం.

**పరిపాలనా, నియంత్రణ అవరోధాలు**

కొన్నిసార్లు నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ బ్యూరోక్రటిక్ నిబంధనల కారణంగా యూరియా ప్రాజెక్టుల అమలుకు చాలా ఆలస్యం అవుతుంది. భూసేకరణ, పర్యావరణ అనుమతులు పొందడం, వివిధ ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు రావడం, కఠిన నిబంధనలు పాటించడం వంటి చర్యలతో ఏళ్లకుఏళ్లు ఈ ప్రక్రియ వాయిదా పడుతోంది. అంతేగాక రసాయనాలు, ఎరువులు, పర్యావరణం, పెట్రోలియం (గ్యాస్ సరఫరా కోసం), ఫైనాన్స్ వంటి వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం లోపిస్తుంది. ఏదైనా విభాగంలో ఆలస్యం జరిగితే మొత్తం ప్రాజెక్టు పురోగతి ఆగిపోతుంది.

**దిగుమతులపై ఆధారపడటం**

స్వల్పకాలిక వ్యవసాయ అవసరాలను తీర్చడానికి అనేక ప్రభుత్వాలు దేశీయ ఉత్పాదకతపై పెట్టుబడులు పెట్టడానికి బదులుగా యూరియాను దిగుమతి చేసుకోవడానికి మొగ్గు చూపుతున్నాయి. ఇది మరింత ఖర్చుకు దారితీస్తుంది. అయితే కొత్తగా ప్రాజెక్ట్ స్థాపించి సరఫరా చేయడానికి బదులుగా ఇది సరళమైన విధానంగా కూడా కనిపిస్తుంది. ప్రత్యేకించి కొన్ని సందర్భాల్లో అంతర్జాతీయ ధరలు తక్కువగా ఉన్నప్పుడు ఈ ఆలోచనలు మరింత పెరుగుతున్నాయి. అయితే, ఎరువుల దిగుమతిపై ఆధారపడటం దీర్ఘకాలిక బలహీనతలను సృష్టిస్తుంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆంక్షలు లేదా ధరల అస్థిరత కారణంగా ఏదైనా ప్రపంచ సరఫరా గొలుసులో అంతరాయం ఏర్పడినప్పుడు అసలు సమస్య గుర్తుకొస్తుంది. ఇది దేశీయ వ్యవసాయ ఉత్పాదకతను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

**ముడిసరుకు సరఫరాలో హెచ్చుతగ్గులు**

యూరియా ఉత్పత్తి సహజ వాయువు లభ్యతపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. దీన్ని ఫీడ్‌స్టాక్‌గా ఉపయోగిస్తారు. అనేక దేశాల్లో సహజ వాయువు కొరత ఉంది. ఒకవేళ దిగుమతి చేసుకోవాలన్నా ఖరీదుతో కూడుకుంది. సహజవాయువు సమృద్ధిగా ఉంటే ప్రభుత్వ సబ్సిడీలు లేకుండా యూరియా ఉత్పత్తిని ఆర్థికంగా లాభదాయకం చేయవచ్చు. గ్యాస్ సరఫరాలో అంతరాయాలు లేదా అననుకూల ధరల ఒప్పందాలు ఉత్పత్తిని నిలిపేస్తున్నాయి. కొత్త ప్లాంట్ ఏర్పాటును ఆలస్యం చేస్తున్నాయి.

**ప్రత్యామ్నాయాలు**

ప్రభుత్వాలు సంప్రదాయ యూరియా వాడకానికి దూరంగా నేల ఆరోగ్యం, పర్యావరణ సుస్థిరతపై అవగాహన పెంపొందించే ప్రయత్నాలను మరింత పెంచాలి. నానో యూరియా, బయో ఫెర్టిలైజర్స్, సేంద్రియ ఎరువులు వాడకం వంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించేలా రైతు సమావేశాలు ఏర్పాటు చేయాలి. యూరియా వాడకంతో పోలిస్తే ఖర్చులు తగ్గుతూ దిగుబడి స్థిరంగా ఉన్నా రైతులు ఇలాంటి ప్రత్యామ్నాయాలవైపు చూసే అవకాశం ఉంది.

## కొత్త టెక్నాలజీతో ఫ్యాన్‌లు ఆవిష్కరణ

ఎలక్ట్రానిక్ ఉపకరణాల తయారీ సంస్థ బీఎల్‌డీసీ టెక్నాలజీతో నడిచే వీగార్డ్ కొత్త ఎయిర్ విజ్ సిరీస్ సీలింగ్ ఫ్యాన్లను ఆవిష్కరించినట్లు తెలిపింది. వీటిలో స్మార్ట్ ఫీచర్లు అందుబాటులో ఉన్నాయని కంపెనీ తెలిపింది. హైస్పీడ్ ఎయిర్ ఫ్లోతో కేవలం 35 వాట్ల విద్యుత్ వినియోగంతో ఇవి పనిచేస్తాయని చెప్పింది. 4/8 గంటల ఆటోఆఫ్ టైమర్‌తో రిమోట్ ఆపరేట్ సదుపాయం ఉందని పేర్కొంది. ఎయిర్ విజ్ సిరీస్‌లో భాగంగా విభిన్న వేరియంట్లను పరిచయం చేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఎయిర్‌విజ్ లైట్, ఎయిర్‌విజ్ ప్రైమ్, ఎయిర్‌విజ్ ప్లస్, ఎయిర్‌విజ్ ఎన్‌లను ఆవిష్కరించింది. వేరియంట్‌ను అనుసరించి ప్రత్యేక ఫీచర్లు ఉన్నట్లు చెప్పింది. వీటిని వీగార్డ్స్ రూర్కీ ఫెసిలిటీలో రూపొందిస్తున్నట్లు పేర్కొంది. ఈ సందర్భంగా వీగార్డ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మిథున్ చిట్టిలపల్లి మాట్లాడుతూ..'ఎయిర్ విజ్ బీఎల్‌డీసీ(బ్రష్ లెస్ డైరెక్ట్ కరెంట్‌ఏసీ మోటార్లను ఉపయోగించే సంప్రదాయ ఫ్యాన్‌ల మాదిరిగా కాకుండా, బీఎల్‌డీసీ ఫ్యాన్‌లు ఎలక్ట్రానిక్ సర్క్యూట్ ద్వారా నియంత్రించబడే శాశ్వత మాగ్నెట్ మోటార్‌ను ఉపయోగిస్తాయి) ఫ్యాన్‌ను ఆవిష్కరించడం సంస్థ ప్రయాణంలో కీలక మైలురాయిని సూచిస్తుంది. వృద్ధి, ఇన్నోవేషన్‌పరంగా ఫ్యాన్ కేటగిరీ మా వ్యాపారానికి చాలా ముఖ్యం. మారుతున్న జీవన శైలికి అనుగుణంగా బీఎల్‌డీసీ సాంకేతికత చాలా అవసరం' అన్నారు.






# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# ఆగస్టు ఒకటిన మాకు డబ్బే డబ్బు

## ట్రంప్ కీలక వ్యాఖ్యలు



**వాషింగ్టన్ డీసీ:** అమెరికా విధించిన సుంకాల గడువు తరుముకొస్తున్న తరుణంలో అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారతదేశం తమతో ఒప్పందం కుదుర్చుకునేందుకు చేరువలో ఉందని ప్రకటించారు. బహ్రెయిన్ క్రౌన్ ప్రిన్స్ సల్మాన్ బిన్ హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫాతో జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు ఒకటి తమకు ఒక ముఖ్యమైన రోజు కానున్నదని, ఆ రోజున తమ దేశానికి పెద్దమొత్తంలో డబ్బు వస్తుందని ట్రంప్ పేర్కొన్నారు. భారతదేశంతో తాము కొత్త వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్నట్లు చెబుతూనే, దీనిపై భారతదేశం అమెరికాల మధ్య చర్చలు జరుగుతున్నాయని ట్రంప్ ఆ సమావేశంలో తెలిపారు. ఆగస్టు ఒకటిన తమ దేశానికి గణనీయంగా డబ్బు వస్తుందని, తాము పలు దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని ట్రంప్ ప్రకటించారు. ఇప్పుడు ఇంకో ఒప్పందం కుదరబోతోందని, అది బహుశా భారతదేశంతో కావచ్చని, దీనిపై చర్చల్లో ఉన్నామని ట్రంప్ పేర్కొన్నారు. వారికి తాము ఒప్పందానికి సంబంధించి, ఒక లేఖ పంపామని తెలిపారు. భారతదేశంతో ఒప్పందానికి తాము చాలా దగ్గరగా ఉన్నామని ట్రంప్ పేర్కొన్నారు. భారత మార్కెట్లకు లబ్ధి చేకూర్చే ఒప్పందంపై అమెరికా పనిచేస్తోందని అన్నారు. కాగా భారత్ అమెరికా మధ్య జరుగుతున్న ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు (బీటీఏ) ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాల మేరకు ముందుకు సాగుతున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ప్రస్తుతం ఐదవ రౌండ్ చర్చలు జరుగుతున్నాయని ప్రభుత్వ అధికారులు ఏఎన్ఐకి తెలిపారు.

# ఇజ్రాయెల్ దెబ్బకు వెనక్కి తగ్గిన సిరియా.. డ్రూజ్‌తో కాల్పుల విరమణ



**డమాస్కస్:** సిరియా దక్షిణ ప్రాంతంలో గత కొంతకాలంగా జాతి ఘర్షణలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఇంతలో ఇజ్రాయెల్.. ఇరాన్ రాజధాని డమాస్కస్‌లోని సిరియన్ ఆర్మీ ప్రధాన కార్యాలయంపై వైమానిక దాడి చేసింది. డ్రూజ్ కమ్యూనిటీ, సిరియన్ అధికారుల మధ్య తాజాగా కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తరుణంలో ఈ దాడి జరిగింది. దీంతో ఇజ్రాయెల్ సిరియా మధ్య ఘర్షణలు మరింతగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సిరియాలో నివసిస్తున్న మైనారిటీ డ్రూజ్ కమ్యూనిటీని రక్షించేందుకే దాడులకు దిగినట్లు ఇజ్రాయెల్ పేర్కొంది. ప్రభుత్వ దళాలు సున్నీ బెడౌయిన్ తెగల మధ్య చోటుచేసుకున్న హింసాత్మక ఘర్షణల్లో డ్రూజ్ కమ్యూనిటీ విలవిలలాడుతోంది. సీఎన్ఎన్ నివేదిక ప్రకారం ఇజ్రాయెల్ దాడుల్లో ముగ్గురు మరణించారు. 34 మంది గాయపడ్డారని సిరియన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ దాడికి ముందు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్.. సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్‌షారాతో.. డ్రూజ్ కమ్యూనిటీని విడిచిపెట్టాలని, లేదంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు. సిరియాలోని స్వీడా ప్రావిన్స్‌లోని డ్రూజ్ కమ్యూనిటీ, సున్నీ బెడౌయిన్ తెగల మధ్య గత కొంతకాలంగా జరిగిన ఘర్షణల్లో ఇప్పటివరకు 248 మందికి పైగా జనం మరణించారు. వారిలో 92 మంది డ్రూజ్ కమ్యూనిటీకి చెందినవారు కావడం గమనార్హం. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఇప్పటికే దక్షిణ సిరియా నుండి సైన్యాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. తరువాత ఇజ్రాయెల్ సైన్యం డమాస్కస్‌లోని గోలన్ హైట్స్ సరిహద్దులో అదనపు సైనిక మోహరింపును ప్రారంభించింది. ఈ పరిణామాల నేపథ్యంలో సిరియన్ ప్రభుత్వ అధికారులు వెనక్కి తగ్గి, డ్రూజ్ కమ్యూనిటీతో కాల్పుల విరమణ ప్రకటించారు. దీనికి సంబంధించిన ప్రకటనను రాష్ట్ర వార్తా సంస్థ 'సనా, డ్రూజ్ నేత సంయుక్తంగా ఒక వీడియో సందేశంలో వెల్లడించారు.



# షాపింగ్ మాల్‌లో భారీ అగ్నిప్రమాదం..

## 50 మంది మృతి!

ఇరాక్‌లో ఓ షాపింగ్ మాల్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో సుమారు 50 మంది మృతి చెందారు. అల్‌కుట్‌లోని ఓ సూపర్ మార్కెట్‌లో ఈ ఘటన జరిగిందని ఇరాక్ మీడియా పేర్కొంది. ప్రమాద దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. భవనం మంటల్లో చిక్కుకుంది. దట్టమైన పొగలు వ్యాపించాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# యూకే పార్లమెంట్‌లో హనుమాన్ చాలీసా రికార్డు

**లండన్:** హనుమాన్ చాలీసా పారాయణతో యూకే పార్లమెంట్‌లో సరికొత్త రికార్డు నెలకొంది. మధ్యప్రదేశ్‌లోని బాగేశ్వర్ ధామ్‌కు చెందిన పండిట్ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి ఇటీవల లండన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన యూకే పార్లమెంట్ హౌస్ లోపల హనుమాన్ చాలీసా శ్లోకాలను పఠించారు. ఇటువంటి పారాయణ జరగడం యూకే పార్లమెంట్‌లో ఇదే మొదటిసారి. దీనికి సంబంధించిన వీడియోను బాగేశ్వర్ ధామ్ తన 'ఎక్స్' హ్యాండిల్‌లో షేర్ చేసింది. పండిట్ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి సమక్షంలో పలువురు అధికారులు శ్లోకాలను పఠించడం వీడియోలో చూడవచ్చు. వీడియోలో పండిట్ ధీరేంద్ర శాస్త్రి కాషాయ దుస్తులు ధరించి కనిపిస్తున్నారు. ఆయన ఆస్ట్రేలియా, యుఎస్, యూరప్‌లలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పలు వేదికలపై ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు.

# పాక్ ఆర్మీకి బిగ్ షాక్.. బీఎల్ఏ దాడిలో సైనికులు మృతి




**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ ఆర్మీకి మరో బిగ్ షాక్ తగిలింది. పాక్ ఆర్మీ బస్సుపై బలోచ్ లిబరేషన్ దాడి చేసింది. ఈ ఘటనలో 29 మంది సైనికులు మృతి చెందినట్టు తెలుస్తోంది. ఇక, బలోచ్ లిబరేషన్(బీఎల్ఏ).. గత ఆరు నెలల్లో 286 దాడులు నిర్వహించి 700 మందిని హతమార్చడం గమనార్హం. వివరాల ప్రకారం.. పాకిస్తాన్ ఆర్మీపై మరోసారి బీఎల్ఏ దాడులపర్వం కొనసాగుతోంది. తాజాగా క్వెట్టా, కలాట్, జహు ప్రాంతాల్లో తాము దాడి చేశామని బలోచ్ లిబరేషన్ ఆర్మీ పేర్కొంది. పాక్ ఆర్మీ ప్రయాణిస్తున్న వాహనంపై ఐఈడీ బాంబులతో దాడి చేసింది. దాడి సమయంలో పాక్ సైనికులు సహా 48 మంది బస్సులో ప్రయాణిస్తున్నారని ప్రకటించింది. దాడి సందర్భంగా 29 మంది పాక్ సైనికులు మృతి చెందినట్టు బీఎల్ఏ పేర్కొంది. పదుల సంఖ్యలో సైనికులు గాయపడినట్టు బీఎల్ఏ తెలిపింది. అయితే, ఆరు నెలల్లో 286 దాడులు నిర్వహించి 700 మందిని బీఎల్ఏ హతమార్చింది. ఇదిలా ఉండగా.. పాకిస్తాన్ ఆర్మీకి బలూచ్ లిబరేషన్ ఆర్మీ చుక్కలు చూపిస్తోంది. అనూహ్య దాడులకు పాల్పడుతూ పాక్ సైన్యానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. వేర్వేరు ఆపరేషన్లలో పాకిస్తానీ భద్రతా దళాలను హతమార్చినట్లు బలూచ్ లిబరేషన్ ఆర్మీ పేర్కొంది. పాకిస్తాన్ సైన్యానికి వ్యతిరేకంగా ఈ యుద్ధాన్ని కొనసాగిస్తామని బీఎల్ఏ తెలిపింది. బలూచిస్తాన్ కు స్వాతంత్ర్యం వచ్చే వరకు పాక్ సైన్యం తగిన మూల్యం చెల్లించుకుంటుందని చెప్పుకొచ్చింది. ఇందులో భాగంగానే దాడులు చేస్తోంది.

### అమెరికాను వణికించిన భూకంపం..

# సునామీ హెచ్చరిక!

**వాషింగ్టన్:** అగ్రరాజ్యం అమెరికాలోని అలస్కా సముద్ర తీరం భారీ భూకంపం కారణంగా వణికిపోయింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.3గా నమోదు అయినట్టు యూఎస్ జియోలాజికల్ సర్వే గుర్తించింది. అలాగే, సునామీ హెచ్చరికలు సైతం జారీ చేసింది. దీంతో, అధికారులు అప్రమత్తమన్నారు. ఇక, భూకంపానికి సంబంధించిన వీడియోలు బయటకు వచ్చాయి. వివరాల ప్రకారం.. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12.37 గంటలకు అలస్కా తీరంలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 7.3 తీవ్రతగా దీన్ని గుర్తించారు. 20.కి.మీ దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. స్యాండ్ పాయింట్ సిటీకి 87 కి.మీ దూరంలో దీని ఎపీసెంటర్ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు వెల్లడి కాలేదు. ముందస్తు జాగ్రత్తగా పౌరులు సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని అధికారులు సూచనలు జారీ చేశారు. మరోవైపు.. యూఎస్ జియోలాజికల్ సర్వే సునామీ హెచ్చరికలు జారీ చేసింది. దక్షిణ అలస్కా, అలస్కా పెనిన్సులా ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. గంట తర్వాత హెచ్చరికలను విరమించుకున్నారు. భూకంపాలు తరుచుగా వచ్చే పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ ప్రాంతంలో అలస్కా ఉంది. 1964 ఉత్తర అమెరికా ప్రాంతంలో 9.2 తీవ్రతతో భూకంపం వచ్చింది. దీంతో 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.



# కౌన్ బనేగా కరోడ్‌పతి 17..

## ఒక్కో ఎపిసోడ్‌కు కోట్లల్లో రెమ్యునరేషన్!




ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ మరోసారి బుల్లితెరపై సందడి చేసేందుకు రెడీ అయ్యాడు. కౌన్ బనేగా కరోడ్‌పతి 17వ సీజన్‌తో అలరించనున్నాడు. ఈ షో ఆగస్టు 11 నుంచి ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని సోనీ టీవీ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఓ ప్రోమో రిలీజ్ చేసింది. అందులో ఈసారి కూడా అమితాబ్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నట్లు చూపించారు.

**25 ఏళ్ల క్రితం మొదలు..**

ఈ క్రమంలో బిగ్‌బీ పారితోషికం ఎంత ఉండొచ్చు? అని నెటిన్లు చర్చించుకుంటున్నారు. బీటౌన్‌లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం అమితాబ్.. ఒక్క ఎపిసోడ్‌కు రూ.5 కోట్ల రెమ్యునరేషన్ తీసుకుంటున్నాడట! 25 ఏళ్ల క్రితం కౌన్ బనేగా కరోడ్‌పతి షో మొదలైంది. బిగ్‌బీ అడిగే ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పినవారు రూ.1 కోటి గెల్చుకునే అవకాశం ఉంటుంది. దీనికి సెలబ్రిటీలను కాకుండా సామాన్యులనే పార్టిసిపెంట్లుగా ఎంపిక చేసుకుంటారు. అందుకే ఈ షోకు ఎక్కువ క్రేజ్!

**తెలుగులోనూ..**

బిగ్‌బీ హోస్టింగ్, కోటి రూపాయల ప్రైజ్‌మనీతో.. రియాలిటీ షోలలోనే కేబీసీ సరికొత్త సంచలనంగా నిలిచింది. ఇదే షో తెలుగులో మీలో ఎవరు కోటీశ్వరుడు పేరిట ప్రారంభమైంది. మొదటి మూడు సీజన్లు నాగార్జున, నాలుగో సీజన్ చిరంజీవి, ఐదో సీజన్ జూనియర్ ఎన్టీఆర్ హోస్ట్ చేశారు. తర్వాతేమైందో కానీ తెలుగులో ఈ షోను కొనసాగించలేదు. అమితాబ్ సినిమాల విషయానికి వస్తే ఆయన ప్రస్తుతం సెక్షన్ 84 మూవీ చేస్తున్నాడు. దీనితో పాటు బిగ్‌బీ చేతిలో.. బ్రహ్మాస్త్ర 2, కల్కి 2898 ఏడీ సీక్వెల్ సినిమాలున్నాయి.



# హరి హర వీరమల్లు కోసం ఐదేళ్లు..

## నిధి అగర్వాల్ సంచలన నిర్ణయం!

సాధారణంగా హీరోయిన్లు ఏడాదికి మూడు, నాలుగు సినిమాలు ఈజీగా చేసేస్తారు. అవకాశాలు వస్తే.. ఐదారు సినిమాలు కూడా చేయగలరు. కానీ ఒక హీరోయిన్ మాత్రం ఐదేళ్లలో ఒకే ఒక సినిమా చేసింది. అయ్యో.. చాన్స్ రాలేదేమో అనుకోకండి. ఈ ఐదేళ్లలో చాలా అవకాశాలు వచ్చాయి. భారీ ప్రాజెక్టులు కూడా ఆమె దగ్గరకు వచ్చాయి. కానీ ఆమె చేయలేకపోయింది. కారణం ఐదేళ్ల క్రితం నాటి సినిమా కోసం రాసుకున్న అగ్రిమెంటే. ఆ సినిమా షూటింగ్ పూర్తయ్యే వరకు మరో సినిమాలో నటించకూడదని చిత్రబృందం ఆమెతో అగ్రిమెంట్ రాసుకుంది. పెద్ద ప్రాజెక్ట్ కదా..మహా అయితే ఏడాది సమయం పడుతుంది. అయినా పర్లేదు మంచి గుర్తింపు వస్తుంది'అనుకొని ఆమె ఒప్పుకుంది. కానీ  ఆ సినిమా వాయిదాల మీద వాయిదా పడుతూ.. చివరకు ఐదేళ్ల తర్వాత రిలీజ్‌కి రెడీ అయింది. ఆ సినిమానే 'హరి హర వీరమల్లు'. ఈ ఐదేళ్లు మరో సినిమా చేయకుండా ఎదురు చూసిన హీరోయినే నిధి అగర్వాల్. అయితే ఈ ఐదేళ్లలో ఆమెకు ఫైనాన్షియల్‌గా ప్రాబ్లమ్ రాకుండా.. షాప్ ఓపెనింగ్స్‌కి వెళ్లిందట. ఈ విషయాన్ని తాజాగా స్వయంగా నిధినే చెప్పింది. హరిహర వీరమల్లు సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా గురువారం నిధి అగర్వాల్ మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా 'ఈ సినిమా కోసం ఐదేళ్లు కేటాయించారు కదా.. ఫైనాన్షియల్‌గా ప్రాబ్లం అయిందా?' అని ఓ విలేకరి అడగ్గా.. 'ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు రాలేదు. నెలకు కనీసం ఒక షాప్ ఓపెనింగ్ అయినా వచ్చేది. ఆ డబ్బు సరిపోయేది' అని నిధి అగర్వాల్ చెప్పింది. ఐదేళ్లు ఆగినా..ఓ మంచి చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నానని, తను పడిన కష్టానికి తగిన గుర్తింపు  వస్తుందనే ఆశిస్తున్నానని నిధి చెప్పింది. అలాగే ఇకపై సీజీ వర్క్ ఉన్న సినిమాలు చేయనని..

2,3 నెలల్లో షూటింగ్ అయిపోయి..రిలీజ్ అయ్యే సినిమాలే చేస్తానని నిధి అగర్వాల్ అన్నారు. ఇకపై తను నటించి ఏ చిత్రానికి అయినా.. హరి హర వీరమల్లు సినిమాకు చేసుకున్నట్లుగా అగ్రిమెంట్ చేసుకోనని తేల్చి చెప్పింది.

# డూప్ లేని యాక్షన్

హీరో మహేశ్‌బాబు–దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల హైదరాబాద్‌లో ఈ సినిమాకు సంబంధించిన కీలక సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్‌ను కెన్యాలో ప్లాన్ చేశారట రాజమౌళి. కానీ కొన్ని కారణాల వల్ల ఈ చిత్రం నెక్ట్స్  షెడ్యూల్ చిత్రీకరణ సౌతాఫ్రికాలో జరగనుందని సమాచారం. అక్కడ కీలకమైన టాకీపార్ట్, ఓ సాంగ్, ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట. ఈ షెడ్యూల్‌కు సంబంధించిన షూటింగ్ రిహార్సల్స్‌తో ప్రస్తుతం యూనిట్ బిజీగా ఉందని తెలిసింది. అంతేకాదు... ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాలను మహేశ్‌బాబు ఎటువంటి డూప్ లేకుండా చేస్తున్నారని, దీంతో యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ సమయంలో యూనిట్ తగిన జాగ్రత్తలుపాటిస్తోందని ఫిల్మ్‌నగర్ భోగట్టా. కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ ఇతర ప్రధానపాత్రల్లో నటిస్తున్నారు. మరో కీలకపాత్రలో మాధవన్ నటిస్తారనే టాక్ తెరపైకి వచ్చింది.



# అమ్మాయి పోస్టర్ చూడగానే అందరూ పారిపోతారు: అనుపమ

అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో వస్తోన్న చిత్రం పరదా. లేడీ ఓరియంటెడ్ మూవీగా వస్తోన్న ఈ సినిమాకు ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో సంగీత, దర్శనా రాజేంద్రన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా వచ్చే నెల ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్‌కు ఇంకా నెల రోజుల సమయం ఉండగానే మేకర్స్ ప్రమోషన్స్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే ఈ సినిమా నుంచి ఓ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు హాజరైన అనుపమ పరమేశ్వరన్ తన సినిమా గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఒక అమ్మాయి లీడ్ రోల్‌గా సినిమా పోస్టర్ చూస్తే అందరూ కూడా వెనక్కి వెళ్లిపోతారని అనుపమ తెలిపింది. అది ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్స్, ఓటీటీతో పాటు ఆడియన్స్ కూడా కావొచ్చని పేర్కొంది. అయితే అది తప్పని నేను చెప్పట్లేదు..అదే రియాలిటీ అని అనుపమ వెల్లడించింది. ఆ రియాలిటీ నుంచే వచ్చిన సినిమా పరదా అని.. మా సినిమా దాదాపు ఏడాది క్రితమే పూర్తయిందని అనుపమ పరమేశ్వరన్ చెప్పుకొచ్చింది.  మా సినిమా రిలీజ్ డేట్ కోసం చాలా కష్టపడ్డామని.. చివరికీ ఆగస్టు 22న మీ ముందుకు వస్తున్నామని తెలిపింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034.   RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com